
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
గురువారం 23 జనవరి 2025



వైసీపీ ఇన్‌చార్జిలు
ఎక్కడ?
● ఉమ్మడి గుంటూరు జిల్లాలో చెల్లాచెదురు
● ఇప్పటికే కనుమరుగైన పలువురు మాజీలు
6
రాజకీయాలకు అతీతంగా
అభివృద్ధి
● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు
● టీడీపీలో చేరిన నలుగురు కౌన్సిలర్లు

● 11 గ్రూపులతో బ్యాంకు సొమ్ము హాంఫట్

స్వాహాకు.. సహకారం



- నకిలీ డ్వాక్రా సంఘాలకు రుణాలు
- రూ.లక్షకు 20 శాతం అధికారులకు కమీషన్
- రూ.1.16 కోట్లను పంచేసుకున్న అక్రమార్కులు
- నాడు అధికారాన్ని వాడేసుకున్న స్థానిక వైసీపీ నేతలు
- పేరేచర్ల, నల్లపాడు జీడీసీసీబీ బ్రాంచ్‌లో వెలుగు చూసిన వైనం

గుంటూరు సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అధికారం ఉంది.. చెప్పినట్లు చేసే వారున్నారు.. ఇంకేం నకిలీ డ్వాక్రా సంఘాలు సృష్టించి రుణాలు మంజూరు చేయించి పంచేసుకున్నారు. అధికారులు కాసులకు కక్కుర్తి పడి బ్యాంకు సొమ్మును ధారాదత్తం చేసేశారు. వైసీపీ హయాంలో గుంటూరు కేంద్ర సహకార బ్యాంకులో చోటుచేసుకున్న వరుస కుంభకోణాలు ఒక్కోటి వెలుగు చూస్తున్నాయి. గుంటూరు రూరల్ మండలంలోని నల్లపాడు జీడీసీసీ బ్యాంకులో రూ.1.16 కోట్ల స్వాహా కేసులో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. లేని డ్వాక్రా సంఘాలను ఉన్నట్లుగా చూపించి బ్యాంకు సొమ్మును దర్జాగా మేసేశారని తేలింది. 2022-23లో 11 నకిలీ డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి పేరేచర్ల, నల్లపాడు బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు స్థానిక వైసీపీ నేతలు పథకం రూపొందించారు. సీసీ ద్వారా ఈ మొత్తం వ్యవహారం నడిపినట్లు సమాచారం. పేరేచర్ల బ్రాంచ్‌లో ఒక గ్రూపునకు పెద్దమొత్తంలో, నల్లపాడు బ్రాంచ్‌లో 10 గ్రూపులకు రూ.10 లక్షలకు తగ్గకుండా రుణం తీసుకున్నారు. అప్పట్లో ప్రజా ప్రతినిధుల వద్ద కీలకంగా ఉన్న చోటా మోటా నాయకులు ఈ రుణాలు మంజూరు చేయించేందుకు జీడీసీసీ ప్రధాన కార్యాలయంలో కీలకమైన స్థానంలో ఉన్న వ్యక్తులతో సిఫార్సు చేయించి రుణాలు మంజూరు చేయించుకున్నారు. రెండు బ్రాంచ్‌ల పరిధిలోని 11 డ్వాక్రా సంఘాల పేరుతో మంజూరైన రూ.1.16 కోట్లను స్థానిక నేతలు వాటాలు వేసుకుని పంచేసుకున్నారని సమాచారం.

నకిలీలకు అధికారుల సహకారం..

నల్లపాడు జీడీసీసీబీ బ్రాంచ్‌లో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగినన్ని అక్రమాలు బహుశా రాష్ట్రంలో ఎక్కడా జరిగి ఉండవు. ఇక్కడ పనిచేసిన బ్యాంకు అధికారులు కోరి నకిలీ డ్వాక్రా సంఘాలకు, నకిలీ వ్యాపారులకు మాత్రమే రుణాలు మంజూరు చేశారన్న ఆరోపణలున్నాయి. కోల్డ్ స్టోరేజ్‌లకు ఇష్టానుసారంగా రుణాలు మంజూరు చేసిన ఘనత ఈ బ్రాంచ్‌కే చెందుతుంది. నకిలీ డ్వాక్రా సంఘాలను ప్రోత్సహించి రుణాలు మంజూరు చేసినందుకు అధికారులు కూడా భారీగానే పుచ్చుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రూ.లక్షకు 20 శాతం చొప్పున కమీషన్ తీసుకున్నట్లు సమాచారం.

పట్టీపట్టనట్లుగా బ్యాంకు అధికారులు

నల్లపాడు జీడీసీసీబీ బ్రాంచ్‌లో నకిలీ డ్వాక్రా సంఘాల పేరుతో రూ.1.16 కోట్లు కొట్టేసిన వ్యవహారంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు సీరియస్‌గా ఉన్నారు. జిల్లా స్థాయి సమావేశంలో కూడా ఆయన ఈ విషయంలో అధికారులను అప్రమత్తం చేశారు. ఇదే విషయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ విజయలక్ష్మి జీడీసీసీ బ్యాంకుకు ప్రత్యేకంగా లేఖ కూడా రాసి అప్రమత్తం చేశారు. అయితే డబ్బులు పోయిన బ్రాంచ్‌లోని అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లుగా నింపాదిగా ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసు కేసు పెట్టి పోయిన సొమ్ము రాబట్టుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం ఆరోపణలకు తావిస్తోంది.



చిలకలూరిపేట మండలం బొప్పూడి ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు

అలైన్‌మెంట్ అలాగే..

- 167ఏ హైవేలో నరసరావుపేట బైపాస్ భూసేకరణ వివాదాస్పదం
- నరసరావుపేట బైపాస్ మినహా రహదారి నిర్మాణానికి సమాయత్తం
- బాపట్ల జిల్లా పేజ్-1లో వేగవంతంగా రహదారి నిర్మాణ పనులు
- రూ.1,064.24 కోట్లు మంజూరు..
- రెండో దశ పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి

- మార్చేందుకు అంగీకరించని అధికారులు
- మార్చాలని రైతులు పట్టు.. సీఎంకు వినతి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఒడరేవు - పొందుగల 167ఏ జాతీయ రహదారి బైపాస్ అలైన్‌మెంట్ మార్చండి.. నరసరావుపేట మున్సిపల్ పరిధిలో రోడ్డు వేస్తున్నారు.. దీనివల్ల ఫలితం ఉండదు.. అలైన్‌మెంట్ మార్చి పట్టణానికి దూరంగా వేయాలి.. అని రైతులు పట్టుబడుతున్నారు. అయితే కుదరదు.. పాత అలైన్‌మెంట్ ప్రకారమే రహదారి నిర్మాణం జరుగుతుంది.. అని నేషనల్ హైవే అధికారులు తేల్చి చెప్తున్నారు. నరసరావుపేట బైపాస్ మినహా మిగతా ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తి కావొచ్చింది. నరసరావుపేట బైపాస్ భూసేకరణ మొదటి నుంచి వివాదాస్పదంగానే ఉంది. అలైన్‌మెంట్ మార్చాలని బాధిత రైతులు సర్వే రాళ్లను తొలగించడం.. భూముల్లో మార్కింగ్ చేయకుండా అడ్డుకుంటూ వస్తున్నారు. అలైన్‌మెంట్ మార్చాలని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి కోరారు. నేషనల్ హైవే అధికారులు మాత్రం అలైన్‌మెంట్ మార్చేందుకు ససేమిరా అని తేల్చిచెబుతున్నారు. నరసరావుపేట బైపాస్ నిర్మాణానికి 279.16 ఎకరాల భూమి అవసరం. సర్వే చేసి రైతులకు నోటీసులు జారీ చేశారు. భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించడంలేదు. నరసరావుపేట మండలం కేసానుపల్లిలో 85.39, జొన్నలగడ్డ 37.15, నరసరావుపేట 33.55, గుంటగార్లపాడు 39.85, రావిపాడు గ్రామ పరిధిలో 83.22 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఈ గ్రామాల పరిధిలో భూసేకరణ వివాదాస్పదంగా మారడంతో రెండో దశలో మిగతా ప్రాంతంలో భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

వేగంగా పనులు

మొదటి దశలో నిర్మిస్తున్న రహదారికి చిలకలూరిపేట కొత్త బైపాస్‌లోపు భూసేకరణ పూర్తి చేశారు. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. కొత్త బైపాస్ నుంచి అడ్డరోడ్డు వరకు నాలుగు వరుసల రహదారికి భూసేకరణ చేయాల్సి ఉంది. కావూరు నుంచి కనపర్రు వరకు భూసేకరణకు రైతులు అంగీకరించారు. కావూరులో 49.15, నాదెండ్ల మండలం గోవిందాపురంలో 43.76, గణపవరంలో 5.80, ఇర్లపాడు 14.66, కనపర్రులో 4.91 ఎకరాల భూ సేకరణ ప్రక్రియ కొలిక్కి వచ్చింది. రొంపిచర్ల మండలం మాచవరం పరిధిలో 11.28 ఎకరాలు, విప్పర్లలో 24.58, నకరికల్లు మండలం రూపెనగుంట్లలో 43.23, చల్లగుండ్లలో 66.80 ఎకరాల సేకరణకు రైతులు సహకరించినట్టు అధికారులు తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతంలో భూమిని కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు ఎన్‌హెచ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రహదారి నిర్మాణం ఇలా..

బాపట్ల జిల్లా ఓడరేవు నుంచి పల్నాడు జిల్లా నకరికల్లు అడ్డరోడ్డు వరకు రెండు వరసల రహదారిని (మిగతా 6వ పేజీలో)

నేటి నుంచి యార్డులో రైతులకు ఉచిత భోజనం

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో గురువారం నుంచి రైతులకు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందుకోసం యార్డులోని భోజన శాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రజాప్రతినిధులు అందుబాటులో లేని కారణంగా ఉదయం 11.30 గంటలకు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత, మిర్చియార్డు పర్సన్ ఇన్‌ఛార్జ్, జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని సెక్రెటరి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. రోజుకు ఎంతమంది రైతులు వచ్చినా కడుపు నిండుగా భోజనం పెడతామని చెప్పారు. అలానే సోమవారం నుంచి ఉదయం అల్పాహారం కార్యక్రమం కూడా ప్రారంభమౌతుందన్నారు.



ఏఎన్‌యూ, థాయిలాండ్ మధ్య ఎంవోయూ



వర్సిటీ వీసీ ఆచార్య గంగాధరరావుని కలిసిన థాయిలాండ్ యూనివర్సిటీ ప్రతినిధులు

పెదకాకాని, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, థాయిలాండ్‌లోని మేజో యూనివర్సిటీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని బోటనీ, మైక్రోబయాలజీ విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జున తెలిపారు. థాయిలాండ్‌లోని మేజో యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ రెన్యువబుల్ ఎనర్జీ విభాగం, ఏఎన్యూ మైక్రో బయాలజీ విభాగం పరస్పర సహకారాన్ని అందించుకుంటాయని పేర్కొన్నారు. అధ్యాపకుల మార్పిడి, బోధన, పరిశోధన, ఇతర పునరుత్పాదక శక్తి వనరుల సాంకేతిక వినిమయం, ఆసియా ఖండంలో ప్రజల మధ్య శాంతి కొరకు కలిసి పని చేయాలని ఈ అవగాహన ఒప్పందంలో నిర్ణయం తీసుకున్నట్లు మల్లికార్జున వివరించారు. ఈ సందర్భంగా మేజో యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రమేష్ ప్రభు, ప్రొఫెసర్ యువ లే విశ్వవిద్యాలయంలోని వృక్ష జీవశాస్త్ర విభాగాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వీసీ ఆచార్య కె.గంగాధరరావు సమక్షంలో ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్, ఆచార్య జి.సింహాచలం, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.వీరయ్య, ఆచార్య అమృతవల్లి, డాక్టర్ మాధవి, ఆచార్య ఖాసిం, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ కె.బాబు, డాక్టర్ కె.నాగరాజు, డాక్టర్ కె.విజయ్, డాక్టర్ మిథున్, డాక్టర్ బాలరాజు పాల్గొన్నారు.

నీటి తోడకంతో బయటకు కనిపిస్తున్న పునాదులు



నీరు తగ్గటంతో బయటకు కనిపిస్తున్న మూడో టవర్ పునాదులు

తుళ్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వాటర్ నుంచి గవర్నమెంట్ కాంప్లెక్స్ టవర్ల పునాదులు బయట పడుతున్నాయి. ఇప్పటికే ఒకటి, రెండు టవర్ల రాఫ్ట్ ఫౌండేషన్ నీటి నుంచి బయట పడిన సంగతి తెలిసిందే. భారీ మోటార్లతో నీటిని తోడేస్తున్నారు. నీటిని తొలగిస్తుండటంతో మరో మూడు టవర్ల పునాదులు బయట పడుతున్నాయి. నాలుగు రోజుల్లో నీరు మొత్తం పునాదుల నుంచి బయటకు వెళ్తుందని చెబుతున్నారు. ఈ నెల ఆఖరికి సీఆర్డీఏ ఈ టవర్ల నిర్మాణానికి టెండర్లు ఓపెన్ చేయనుంది. నీటిని తొలగించి వెంటనే ప్రభుత్వ కాంప్లెక్స్ టవర్ల నిర్మాణం పునఃప్రారంభం చేయనున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పునాదులు నీటిలో నాని ఉన్నా, నిర్మాణానికి ఢోకా లేదని ఐఐటీ మద్రాసు, ఐఐటీ హైదరాబాద్ సంస్థలు ధ్రువీకరించాయి. నీటి తొలగింపు పూర్తి అయిన తరువాత నిర్మాణాలు మొదలు పెట్టే ముందు మరొకసారి ఆ సంస్థలు పరిశీలించి నివేదికలు ఇవ్వనున్నాయి.

వైసీపీ ఇన్‌చార్జిలు ఎక్కడ?

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో చెల్లాచెదురు
- ఇప్పటికే కనుమరుగైన పలువురు మాజీలు
- నాథుడులేని నావగా పొన్నూరు.. గుంటూరు పశ్చిమ
- మర్రి మౌనంతో చిలకలూరిపేటలో రజిని ఎదురీత
- సత్తెనపల్లిలో వైసీపీని వీడేందుకు 'చిట్టా' సిద్ధం
- నియోజకవర్గంలో అడుగుపెట్టలేని స్థితిలో పిన్నెల్లి

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి అప్పుడే ఎన్నికలు వస్తున్నట్లు భావించుకుని తిరిగి అధికారం ఖాయమనే ఊహల్లో విహరిస్తుండగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు మాత్రం భవిష్యత్‌పై ఆశలు వదిలేసుకుని కాడి కింద పడేశారు. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు ఒక్క నియోజకవర్గంలో కూడా గెలుపొందని విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో కొన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలే లేని దుస్థితిలో ఆ పార్టీ ఉంది. మరికొన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలు ఉండీ లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారం అండగా విర్రవీగిన మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే నియోజకవర్గం వదిలిపెట్టి పక్క రాష్ట్రంలో తలదాచుకోవాల్సిన హీనస్థితికి వెళ్ళారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ఆయన నియోజకవర్గంలో అడుగుపెట్టకపోవడంతో దిక్కుతోచని స్థితిలో అక్కడ వైసీపీ కేడర్ ఉంది. ఇక వైసీపీ హయాంలో వినుకొండ ఎమ్మెల్యేగా నోటికొచ్చినట్టు విపక్షీయులపైనే కాకుండా స్వపక్షీయులపై కూడా నోటికొచ్చినట్టు మాట్లాడుతూ బూతుల బ్రహ్మయ్యగా పేరొందిన బొల్లా బ్రహ్మనాయుడు ప్రస్తుతం నోరుమెదపకుండా ఉంటూ అసలు ఆ నియోజకవర్గానికి ఆయనేనా ఇన్‌చార్జి అనే అనుమానాలు కలగ చేస్తున్నారు. ఇక వైసీపీలో మంత్రిగా ఓ వెలుగు వెలిగిన విడదల రజిని తిరిగి చిలకలూరిపేటలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు భయం భయంగా అడుగుపెట్టారు. అయితే ఆమెకు ఇన్‌చార్జి పదవిని తిరిగి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పార్టీని వీడే ఉద్దేశంతో మౌనంగా ఉండటంతో ఆమె అక్కడ ఎదురీత ఈదాల్సి వస్తున్నది. రేపల్లె నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి దయనీయంగా ఉంది. ఆ నియోజకవర్గంలో కొంత పట్టున్న మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణ ఆ పార్టీని వీడి టీడీపీలో చేరటంతో దాదాపు వైసీపీ కేడర్ అంతా ఆయన వెంటే వెళ్లిపోయింది. ఇక గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఈపూరు గణేష్ పూర్తిగా కాడి కిందపడేసి వైద్య వృత్తికే తిరిగి అంకితమైపోయారు. అలాగే తెనాలి ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఉన్నా ఆయన ఇంటికే పరిమితమైపోయారు. ఎస్సీ నియోజకవర్గాలైన తాడికొండ, ప్రత్తిపాడు, వేమూరు నియోజకవర్గాల పరిస్థితి కూడా దయనీయంగానే ఉంది. తాడికొండ నుంచి పోటీ చేసి ఓడిన మాజీ మంత్రి మేకతోటి సుచరిత ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి ఏకంగా రాజకీయాల నుంచే తప్పుకున్న విషయం తెలిసిందే. ప్రత్యామ్నాయం ఎవరూ దొరక్క గుంటూరు నగరం నుంచి డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబును వలస తీసుకెళ్ళారు. అయితే ఆయన ఒంటెద్దు పోకడల మూలంగా అప్పుడే స్థానిక కేడర్‌లో వ్యతిరేకత మొదలైంది. ప్రత్తిపాడు నుంచి పోటీ చేసి ఓడిన వలస నేత బలసాని కిరణ్‌కుమార్ తిరిగి బెజవాడకు వెళ్లిపోయారు. వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు కొంత మేరకు నియోజకవర్గానికి అందుబాటులో ఉన్నా మాజీ మంత్రి మేరుగ నాగార్జునతో ఉన్న విభేదాల మూలంగా అక్కడి పార్టీ పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. ఇక గుంటూరు పశ్చిమ, పొన్నూరు నియోజకవర్గాలకు ఇన్‌చార్జి లేని పరిస్థితి. గుంటూరు పశ్చిమ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన మాజీ మంత్రి రజిని చిలకలూరిపేటకు వెళ్లడంతో ఇక్కడ ఎవరినీ నియమించలేదు. టీడీపీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకునేందుకు ఎవరూ సాహసించే పరిస్థితి కూడా లేదు. గత ఎన్నికల్లో గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య ఏకంగా పార్టీయే ఫిరాయించటంతో పార్లమెంటు నియోజకవర్గానికి కూడా ఇన్‌చార్జి లేని పరిస్థితి నెలకొన్నది. పొన్నూరు నుంచి పోటీ చేసి పరాజయంపాలైన అంబటి మురళీకృష్ణ గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ వివాదంలో చిక్కుకుని తిరిగి పొన్నూరులో అడుగుపెట్టలేని స్థితిలో ఉన్నారు. సత్తెనపల్లి ఇన్‌చార్జిగా కొద్ది రోజులుగా డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డిని నియమించారు. అయితే ఆయన నియామకాన్ని వ్యతిరేకిస్తున్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కర్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఏమాత్రం ప్రజాబలం లేని వ్యక్తులకు బాధ్యతలు అప్పగించటం ఏంటంటూ అలక వహించిన ఆయన వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారు. గుంటూరు తూర్పు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న షేక్ నూరిఫాతిమా కూడా అస్త్ర సన్యాసం చేశారు. గురజాల ఇన్‌చార్జి కాసు మహేష్‌రెడ్డి పార్టీ కార్యక్రమాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. నరసరావుపేట ఇన్‌చార్జి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చురుగ్గా వ్యవహరించడం లేదు. మంగళగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసి యువనేత నారా లోకేశ్ చేతిలో ఘోర ఓటమిని చవిచూసిన మురుగుడు లావణ్య ఆ షాక్ నుంచి ఇంకా కోలుకోలేదు. పెదకూరపాడు ఇన్‌చార్జి నంబూరు శంకరరావు పార్టీ శ్రేణులకు దూరంగా ఉంటూ వ్యాపారంలో మునిగిపోయారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు
- టీడీపీలో చేరిన నలుగురు కౌన్సిలర్లు



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పని చేయాలనీ, అందుకే అందరిని కలుపుకొని ముందుకు వెళ్తున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో వైసీపీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు నూతనంగా జీవీ ఆంజనేయులు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన 11వ వార్డు కౌన్సిలర్ క్లిస్టం నీలిమ, 20వ వార్డు కౌన్సిలర్ నంది అంజలి, 21వ వార్డు కౌన్సిలర్ గర్రె శ్రీనివాసరావు, 4వ వార్డు కౌన్సిలర్ ఇందుమతికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వినుకొండ మున్సిపాల్టీ పరిధిలో మొత్తం 32 కౌన్సిలర్లు ఉండగా వైసీపీ నుంచి గెలుపొందిన 28 కౌన్సిలర్లకుగానూ గత ఎన్నికల సమయంలో గంధం కృష్ణవేణి, మార్కెట్ నన్నేసా టీడీపీలో చేరగా, నూతనంగా మరో నలుగురు చేరడం అభినందనీయం అన్నారు. వైసీపీ హయాంలో వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడడంతో అభివృద్ధే లక్ష్యంగా వారు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. అభివృద్ధికి సహకరించే వారందరికీ అండగా ఉంటామని చెప్పారు. గత ఎన్నికల్లో కనివిని ఎరుగని రీతిలో 30 వేల ఆధిక్యంతో గెలిపించారనీ, వినుకొండ పట్టణంలో మరింత ఆదరించారని వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. భావితరాలు గుర్తుపెట్టుకునేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. త్వరలో రామలింగేశ్వర స్వామి ఆలయం, ఘాట్ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేస్తాం అన్నారు. ఇంటింటికీ మంచినీరు అందిస్తామని చెప్పారు. శాశ్వత మంచినీటి పథకంతోపాటు స్టేడియం, షాదిఖానా, పార్కు, టీటీడీ కల్యాణ మండపం పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం టీడీపీలో చేరిన కౌన్సిలర్లు క్లిస్టం నీలిమ, నంది అంజలి, గర్రె శ్రీనివాసరావు, ఇందుమతితోపాటు నంది కొండలు, క్లిస్టం బ్రహ్మయ్య, గర్రె నరసింహరావు, పులిపాటి రామారావు, 2వ సచివాలయం మహిళా కన్వీనర్ లక్ష్మీ సామ్రాజ్యం, వైసీపీ బూత్ కన్వీనర్ గోళ్ళ రాజును పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు.

నేడు మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు

- ఉదయం ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్
- సాయంత్రం లైవ్ మ్యూజికల్ షో
- మెగా రక్తదాన శిబిరం, అన్నదానాలు

మంగళగిరి సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యుడు నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పలు కార్యక్రమాలు జరుగనున్నాయి. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఉదయం 8:30 గంటలకు గౌతమబుద్ధ రోడ్డు వెంబడి మయూరీ టెక్ పార్కు ఎదురుగా మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ ప్రారంభిస్తారు. 9:30 గంటలకు నవులూరు స్టేడియంలో ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్‌ను ఎంపీ సానా సతీశ్ ప్రారంభిస్తారు. 11:30 గంటలకు విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి మంగళగిరి బైపాస్ మయూరి టెక్ పార్కు ఎదురుగా ఉన్న మైదానంలో పెద్ద ఎత్తున లైవ్ మ్యూజిక్ షో జరుగనుంది. షేక్ రియాజ్ ఆధ్వర్యంలో చినకాకాని సైన్ ఆశ్రమంలో అన్నదానం, గౌరీ శంకర్ ఆధ్వర్యంలో గాలిగోపురం వద్ద అల్పాహారం, జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో నృసింహాలయంలో ప్రత్యేక పూజలు, టీడీపీ పట్టణ, రూరల్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెస్సెస్ భవన్‌లో కేక్ కటింగ్, ఎల్ఎస్ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం, ఆటోనగర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ, సోలార్ డాట్ ఇన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వెయ్యి థర్మల్ వాటర్ బాటిళ్ల పంపిణీ, జగ్గారపు రాము ఆధ్వర్యంలో పాతమంగళగిరి పాఠశాలకు ఆర్వో ప్లాంటు బహూకరణ, జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ, కొత్తపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నదానం, తోపుడు బండ్లు, ట్రైసైకిల్స్ పంపిణీ, షేక్ సుభాని, రాయపూడి కిరణ్, కంభం సాయి, గోసాల రాఘవ ఆధ్వర్యంలో వేర్వేరుగా అన్నదాన కార్యక్రమాలు జరుగనున్నాయి. నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్, ఎల్లో సింగం ఆధ్వర్యంలో ఆత్మకూరులోని పీజీఎం చిల్డ్రన్ హోంలో బాలలకు అన్నదానం చేయనున్నారు.

అలైన్‌మెంట్ అలాగే...

(5వ పేజీ తరువాయి)

నాలుగు వరసలుగా విస్తరిస్తున్నారు. రెండు ప్యాకేజీలు రూ.1,064 కోట్లతో రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్) పనులు నిర్వహిస్తోంది. ఓడరేవు బీచ్ నుంచి రహదారి నిర్మాణం ప్రారంభమవుతోంది. 45 మీటర్ల వెడల్పున భూమిని సేకరిస్తారు. గత ఫిబ్రవరిలో మొదటి ప్యాకేజీలో పనులు ప్రారంభమయ్యాయి. ఓడరేవు, చీరాల, కారంచేడు, పర్చూరు, తిమ్మరాజుపాలెం, చిలకలూరిపేట, గంగన్నపాలెం, నరసరావుపేటలో బైపాస్‌లు నిర్మిస్తారు. 85 కిలోమీటర్ల రహదారి నిర్మాణంలో 46 కిలోమీటర్లు బైపాస్‌ల నిర్మాణం ఉంటుంది. ప్యాకేజి ఒకటిలో ఓడరేవు నుంచి చిలకలూరిపేట వరకు 47 కిలోమీటర్లు.. ప్యాకేజ్ రెండులో చిలకలూరిపేట నుంచి అడ్డరోడ్డు వరకు 38 కిలోమీటర్లు. కారంచేడు-పర్చూరు మధ్య ఉప్పుటూరు వద్ద ఒక టోల్ ప్లాజా, చిలకలూరిపేట మండలం కావూరు దగ్గర మరో టోల్ ప్లాజా ఏర్పాటు చేస్తారు. తొమ్మిది ఫ్లైఓవర్లు, రెండు ఆర్‌వోబీలు.. ఆరు మేజర్ బ్రిడ్జిలు, రెండు ఇంటర్ ఛేంజింగ్‌లు నిర్మిస్తారు. 167ఏ జాతీయ రహదారి చీరాల, చిలకలూరిపేట ప్రాంతాల్లో రెండు జాతీయ రహదారులను కలుపుతారు. వాకావారిపాలెం దగ్గర చీరాల కారంచేడుకు బైపాస్ 14.3 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తారు. పర్చూరు-గుంటూరు రోడ్డు క్రాసింగ్ దగ్గర మరో ఫ్లైఓవర్ నిర్మిస్తారు. చిలకలూరిపేట రోడ్డులో కలుస్తుంది. చిలకలూరిపేటకు మరో బైపాస్ వస్తోంది. పసుమర్రు దగ్గరలో దీనిని నిర్మిస్తారు. బొప్పూడి దగ్గర కొత్త బైపాస్‌లో కలుస్తుంది.



చిలకలూరిపేట మండలం బొప్పూడి ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు

టెండర్ నిర్వహణలో జాప్యం..

ప్యాకేజ్ రెండులో రహదారి నిర్మాణానికి టెండర్లు నిర్వహించారు. రెండో ప్యాకేజీలో భూసేకరణ జాప్యం కారణంగా టెండర్ నిర్వహణలో జాప్యం జరిగింది. కొత్త బైపాస్ నుంచి ప్యాకేజ్ రెండు ప్రారంభమవుతుంది. పాత రహదారిని విస్తరిస్తారు. గంగన్నపాలెంలో బైపాస్ వస్తుంది.

ఈశ్వర్ కళాశాల దగ్గర కుడి వైపునకు నరసరావుపేట బైపాస్ ప్రారంభమవుతుంది. 14.4 కిలోమీటర్ల బైపాస్ నిర్మిస్తారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పక్క నుంచి కుప్పగంజి వాగు మీదగా టిడ్కో ఇళ్ల సమీపంలో రైల్వే లైన్ క్రాస్ చేస్తారు. ఇక్కడ ఆర్‌వోబీని నిర్మిస్తారు. నరసరావుపేట-గుంటూరు రోడ్డు క్రాస్ చేస్తోంది. ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇస్సపాలెం దగ్గర సత్తెనపల్లి రోడ్డు క్రాస్ చేస్తోంది. ఇక్కడ ఫ్లైఓవర్‌ను నిర్మిస్తారు. రావిపాడు తర్వాత ఉన్న రహదారిలో ఇది కలుస్తుంది. అక్కడ నుంచి ఉన్న రహదారిని విస్తరిస్తారు. అడ్డరోడ్డు దగ్గర బైపాస్ నిర్మిస్తారు. ఈ గ్రామం వద్ద ఇంటర్ చేంజ్ నిర్మించి అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిలో కలుపుతారు.

హోరాహోరీగా భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు (విద్య) జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్లలో భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన పోటీలను సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పరిశీలించారు. క్రికెట్ పోటీలు మూడో రోజు హోరాహోరీగా సాగాయి. ఉదయం ప్రిలిమినరీ మ్యాచ్లో గుంటూరు గ్లాడియేటర్స్-1 జట్టు, హైదరాబాద్ హరికేన్స్-1 జట్టుతో తలపడగా గుంటూరు గ్లాడియేటర్స్-1 జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం క్వార్టర్స్ ఫైనల్స్ మ్యాచ్లో వెస్ట్ గోదావరి వారియర్స్‌తో గుంటూరు గార్డియెన్స్-2 జట్టు తలపడగా వెస్ట్ గోదావరి వారియర్స్ జట్టు విజయం సాధించింది. పోటీల్లో గెలుపొందిన జట్టుకు చైర్మన్ భాష్యం రామకృష్ణ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు నుంచి గయాకు ప్రత్యేక రైలు

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం గుంటూరు నుంచి గయాకు ఒక ప్రత్యేక రైలును నడపనున్నట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07719 గుంటూరు - గయా రైలు ఈ నెల 25న మధ్యాహ్నం 2.20కి బయలుదేరి వరంగల్ మీదుగా మరుసటి రోజు రాత్రి 8.30కి ప్రయాగ్‌రాజ్ చియోకి, సోమవారం ఉదయం 9 గంటలకు గయా చేరుకొంటుంది. మొత్తం 1939 కిలోమీటర్ల దూరం ఈ రైలు ప్రయాణిస్తుంది. తిరుగు ప్రయాణం నంబరు 07720 గయా - గుంటూరు ప్రత్యేక రైలు ఈ నెల 27వ తేదీన(సోమవారం) మధ్యాహ్నం 2.15కి బయలుదేరి రాత్రి 9.25కి ప్రయాగ్‌రాజ్ చియోకి, బుధవారం వేకువజామున 4 గంటలకు గుంటూరు చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు స్లీపర్, ఏసీ, జనరల్ బోగీలతో ప్రయాణిస్తాయని డీఆర్ఎం తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్ష ప్రారంభం



నల్లపాడులోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల కోలాహలం

గుంటూరు (విద్య), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాంకేతిక విద్యాసంస్థలైన నిట్, ఐఐటీల్లో ప్రవేశం కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్ష బుధవారం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో ఇందుకోసం మొత్తం ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లాకు సంబంధించి నల్లపాడు, యూనివర్సల్ ఇంజనీరింగ్ కాలేజి, పేరేచర్ల, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజి, పుల్లడిగుంట, పల్నాడులో నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజి, ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించారు. ప్రవేశ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు రెండు విడతల్లో నిర్వహించారు. ఆయా కేంద్రాలకు విద్యార్థులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. నిర్దేశించిన సమయం కంటే ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించమని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ముందుగానే స్పష్టం చేయడంతో విద్యార్థులు దాదాపు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. విద్యార్థులను తనిఖీ చేసిన అనంతరం కేంద్రాల్లోకి అనుమతించారు. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

రూ. 476 కోట్లు లక్ష్యంగా మార్కెట్ సెస్ వసూలు

- 9 జిల్లాల పరిధిలోని 90 యార్డులలో ఎరువుల విక్రయ కేంద్రాలు
- మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ శ్రీనివాసరావు



వేమూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రీజియన్ పరిధిలోని 9 జిల్లాల్లో ఉన్న 90 వ్యవసాయ మార్కెట్ యార్డుల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.476 కోట్లు మార్కెట్ సెస్ వసూలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని, డిసెంబరు నాటికి రూ.270 కోట్లు వసూలు చేశామని, మిగిలిన రూ. 206 కోట్లను మూడు నెలల్లోగా వసూలు చేస్తామని మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన వేమూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు విచ్చేసి విలేకర్లతో మాట్లాడారు. ఏలూరు, వెస్ట్ గోదావరి, ఈస్ట్ గోదావరి, ఎన్టీఆర్ జిల్లా, పల్నాడు, కృష్ణ, గుంటూరు, బాపట్ల ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో ఉన్న 90 యార్డులలో రైతుల సౌకర్యార్థం రసాయన ఎరువుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ కన్నా తక్కువ ధరకు ఎరువులు విక్రయించనున్నట్లు చెప్పారు. డీసీఎంఎస్‌లు ద్వారా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. యార్డుల అభివృద్ధికి ప్రభుత్వ ఆదేశాల మేరకు అంచనాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఎరువులతో పాటుగా విత్తనాల కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. జొన్న, మొక్కజొన్న, పసుపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. రైతుబంధు పథకం ద్వారా మార్కెట్ యార్డు గోదాములలో నిల్వ చేసిన ధాన్యానికి సరుకు విలువలో 75 శాతం గరిష్టంగా రూ. 2 లక్షల వరకు వడ్డీ లేని రుణాన్ని అందజేస్తాం అన్నారు. ఒకసారి పొందిన రైతు బంధు పథకం కార్డును ఐదు సంవత్సరాల వరకు వినియోగించుకోవచ్చన్నారు. సరుకుకు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. నామమాత్రపు అద్దె కింద బస్తాకు నెలకు రూపాయి చొప్పున, అలాగే ఇన్సూరెన్స్ చార్జీల కింద బస్తాకు నెలకు ఒక రూపాయి చొప్పున మాత్రమే వసూలు చేస్తారని వివరించారు. సౌకర్యాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో యార్డు కార్యదర్శి అంజిబాబు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 558.10 అడుగులు ఉంది. ఇది 227.97 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7353 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 25,402 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 45,002 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	145,154,165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

87,523 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 90,138 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 87,523 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 59,487 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7200	15000	334	7200	14000
నెంబరు. 5	10000	10500	నెంబరు.5	10000	10000
273	9500	13500	273	--	--
341	8500	15000	341	8000	13500
4884	9000	14000	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	15500	తేజ	8000	15000
బ్యాడిగి	8000	13000	బ్యాడిగి	8000	12000
దేవనూరు డీలక్స్	8000	13500	దేవనూరు డీలక్స్	10000	11000
తెల్లకాయలు	4000	10000	తెల్లకాయలు	4000	8500

పెట్టుబడులే లక్ష్యంగా చంద్రబాబు దావోస్ పర్యటన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన కొనసాగుతోందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ దేశాల ఆర్థిక సదస్సులో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో కలసి అంతర్జాతీయ స్థాయి దిగ్గజ కంపెనీలతో చర్చలు జరిపి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను వివరిస్తున్నారని తెలిపారు. ప్రముఖ కంపెనీల సీఈవోలతో చర్చలు జరిపి ఏపీ ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను తెలియజేసి పెట్టుబడులు పెట్టించేందుకు కృషి చేయటం అభినందనీయమన్నారు. మైక్రోసాఫ్ట్ కంపెనీ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌తో పాటు మల్టీ నేషనల్ కంపెనీల సీఈవోలతో చర్చలు జరిపి ఏపీలో పెట్టుబడులకు ఎంఓయూలు చేసుకోవటం హర్షణీయమన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనేది కూటమి ప్రభుత్వ విధానమ న్నారు. పేదరికం, సమాజంలో అసమానతలను రూపుమాపటానికి కార్పొరేట్ సంస్థల అధిపతులు ముందుకు వచ్చి బాధ్యతలు తీసుకోవాలని దావోస్‌లో సీఎం పిలుపు నివ్వటంపై రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఒక్క కంపెనీ కూడా పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రాలేదని, దావోస్ వెళ్లి ప్రపంచ దేశాల ఆర్థిక సదస్సులో పాల్గొనే ప్రయత్నం కూడా చేయలేదన్నారు.

యరపతినేని లక్ష్మయ్య స్మారక రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్


రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు వున్నం నాగమల్లికార్జునరావు, సర్వేశ్వరరావు తదితరులు

పిడుగురాళ్ల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): యరపతినేని లక్ష్మయ్య పేరుతో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమని టీడీపీ నేతలు వున్నం నాగమల్లికార్జునరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావులు తెలిపారు. బుధవారం స్థానిక స్కాలర్స్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో యరపతినేని లక్ష్మయ్య స్మారక రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం పార్టీ నేతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కృషి చేస్తున్నారని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.లక్ష వున్నం శ్రీను(పాలకేంద్రం), రెండో బహుమతి రూ.60వేలు తిరుమల రాజేష్, మూడో బహుమతిగా రూ.30వేలు బెల్లం కిషోర్‌లు అందించనున్నారని నిర్వాహకులు ఆవుల జనార్ధన్, షేక్ ఈసా, నలబోతుల సురేష్‌గోపి, అంకాళ్ల అశోక్‌కుమార్, నరసింహ, సలీమ్, కంభంపాటి సూర్య తెలిపారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, సయ్యద్ అమీర్‌అలి, వడ్డవల్లి సాంబశివరావు, పిల్లి చెన్నారావు, పణితి రవి, కామిశెట్టి రమేష్, నెకరికంటి శివ, తదితరులు పాల్గొన్నారు.

భాష్యం స్కూల్‌లో క్రీడాపోటీలు

పిడుగురాళ్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాష్యం స్కూల్‌లో ఇంట్రా స్పోర్ట్స్ మీట్ బుధవారం ప్రారంభమైంది. పాఠశాలకు చెందిన విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, షాట్‌పుట్, రన్నింగ్‌తోపాటు మరికొన్ని ఆటలను నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక క్రీడలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ఐఎంఏ అధ్యక్షులు, మమత హాస్పటల్ అధినేత డాక్టర్ ధూళిపాళ్ల భరత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకాగా భాష్యం స్కూల్ నర్సరావుపేట జోన్ జడ్ఈఓ హృదయ రాజు, ప్రిన్సిపాల్ ఈశ్వర్, హెచ్ఎం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నేడు లోకేశ్ జన్మదిన వేడుకలు

సత్తెనపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23వ తేదీన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో జరుగుతాయని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి నూర్ బాషా జానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం.. కాపాడిన యువకుడు

ముప్పాళ్ళ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్‌లోకి వృద్ధురాలు దూకి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు నరసరావుపేటలో నివాసం ఉంటున్న మహిళ చాగంటివారిపాలెంలో తన సోదరులను పలుకరించేందుకు వచ్చి కెనాల్‌లోకి దూకింది. అక్కడే ఉన్న యువకుడు పఠాన్ ఫిరోజ్ గమనించి ఆమెను ఒడ్డుకు తీసుకువచ్చాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఎస్ఐ సోమేశ్వరరావు, సిబ్బంది ఆమెకు నచ్చజెప్పి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా పఠాన్ ఫిరోజ్‌ను పోలీసులు అభినందించారు.

గ్రామాల అభివృద్ధే ఎమ్మెల్యే ధ్యేయం

నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హనుమంతరావు నాయక్

బెల్లంకొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల అభివృద్ధే ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ధ్యేయమని పెదకూరపాడు నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హనుమంతరావు నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల అనతి కాలంలోనే నియోజకవర్గంలో మారుమూల గ్రామాలను రూ.40కోట్ల నిధులతో ఎమ్మెల్యే ప్రవీణ్ అభివృద్ధి చేశారన్నారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. సమావేశంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగమణి బాయి, ఎస్టీ సెల్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో మాచర్ల పోలీసుల మీనమేషాలు

● న్యాయం కోసం బాధితుడి సెల్ఫీ వీడియో

మాచర్లటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మాచర్లలో జరిగిన చోరీ కేసులో పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. చోరీ జరిగి నెలరోజులు గడిచినా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేయడంలో నిర్లక్ష్యధోరణి అవలంబిస్తున్నారు. బాధితుడు న్యాయం కోసం స్టేషన్ చుట్టూ తిరిగి విసుగుచెంది సెల్ఫీ వీడియో విడుదల చేయడంతో సంఘటన వెలుగులోకి వచ్చింది. మాచర్లలో తహసీల్దార్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న ఓ హోటల్‌లో పనిచేస్తున్న మహిళ గత డిసెంబర్ 27న యజమానుల కన్నుగప్పి చోరీకి పాల్పడింది. యజమాని మాలపాటి మహేష్ సీసీ కెమెరా పరిశీలించి 29వ తేదీన పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఉన్న ఎస్ఐ సంధ్యారాణికి జరిగిన విషయాన్ని వివరించారు. గల్లా పెట్టెలో రూ.50 నగదు, బంగారపు ఉంగరం, వెండిపట్టీలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సీసీ ఫుటేజీని కూడా అందించారు. అప్పటినుంచి పలుమార్లు స్టేషన్ చుట్టూ తిరిగినా ఎఫ్ఐఆర్ నమోదుచేయకుండా రాజీపడమని ఒత్తిడిచేస్తున్నట్లు వీడియోలో పేర్కొన్నాడు. రెండురోజుల క్రితం స్టేషన్‌కు పిలిపించి ఫిర్యాదు విత్‌డ్రా చేసుకోండంటూ ఎస్ఐ బెదిరించారని, రైటర్ రమేష్ సమక్షంలో రాజీపడుతున్నట్లు రాజీపత్రం రాయించి, రూ.30వేలు నెల తర్వాత ఇస్తారు.. ఇవ్వకపోతే అప్పుడు ఎఫ్ఐఆర్ నమోదుచేస్తామని సంతకాలు పెట్టించుకున్నారని ఆరోపించారు. ఇదేకాక ఇటీవల జరిగిన పలు కేసుల్లో సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యాలను చూసి కూడా కేసు నమోదుచేయకుండా పోలీసులు ఇబ్బందులు పెడుతున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

ఉరివేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

మాచర్లటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాచర్లలో జరిగింది. పట్టణంలోని పదో వార్డు రైలుకట్ట బజారుకు చెందిన తాళ్లూరి అలేఖ్య (19) స్థానికంగా డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈమె కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అలేఖ్య సోదరి రమ్య గమనించి కేకలు పెట్టడంతో స్థానికులు అలేఖ్యను మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పట్టణ ఎస్ఐ సంధ్యారాణి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అలేఖ్య మృతదేహం

రెవెన్యూ అధికారుల పొలంబాట

● ఆర్ఎస్ఆర్‌కు, అడంగల్‌కు తేడాలు ఎందుకు వస్తున్నాయి?
● పూర్తి నివేదిక సమర్పించాలంటూ స్థానిక అధికారులకు జేసీ ఆదేశం


వేమవరం శివారులో పొలాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మాచవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో మాచవరం మండలంలోని వేమవరం, చెన్నాయపాలెం తదితర గ్రామాల్లో భూసమస్యలు ఎక్కువగా వస్తుండటంతో పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ స్థానిక రెవెన్యూ అధికారులను పొలంబాట పట్టించారు. వేమవరం, చెన్నాయపాలెం గ్రామాల నుంచి భూసమస్యలపై కొంతమంది రైతులు రాష్ట్రస్థాయి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులను కూడా కలసి తమ సమస్యలను విన్నవించుకోవటంతో వారి సూచనల మేరకు మండలస్థాయి రెవెన్యూ అధికారులను పొలాలను పరిశీలించి నివేదిక సమర్పించాలంటూ జేసీ ఆదేశించారు. దీంతో గత వారంరోజులుగా కార్యాలయాల్లో తిష్టవేసిన అధికారులు సంబంధిత రికార్డులను పరిశీలించి గత రెండు రోజులుగా ఆయా గ్రామాల్లోని పొలాలను పరిశీలిస్తున్నారు. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి రైతులు భూసమస్యలపై ఎక్కువగా అర్జీలు సమర్పిస్తుండటంతో సర్వే నిర్వహించి తుది నివేదిక ఇవ్వాలంటూ జేసీ ఆదేశించారు. మండలంలోని సర్వేయర్లు, వీఆర్‌వోలు మూకుమ్మడిగా వేమవరం, చెన్నాయపాలెం రెవెన్యూ గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. ఆర్ఎస్ఆర్‌కే, అడంగల్‌కు సుమారు 600 ఎకరాల భూమి తేడా ఉండటంతో ఎందుకు తేడా వస్తుంది? ఏం జరిగిందంటూ స్థానిక రెవెన్యూ అధికారులపై జేసీ ప్రశ్నల వర్షం కురిపించారు. గతంలో ఇక్కడ భూమాయ ద్వారా వందల ఎకరాల ప్రభుత్వ భూములను, అసైన్డ్ భూములు, పులిచింతల ముంపు జాబితాలో ఉన్న భూములను అధికారుల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదుచేయించుకొని బ్యాంకుల్లో రూ.లక్షల్లో రుణాలు పొందిన విషయం తెలిసిందే. నేటికీ దీనికి పరిష్కారం లభించలేదు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ: గురజాల డీఎస్పీ జగదీష్

దాచేపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వాహనచోదకులు హెల్మెట్లు ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని గురజాల డీఎస్పీ జగదీష్ అన్నారు. బుధవారం దాచేపల్లిలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పల్నాడు జిల్లా గురజాల సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా దాచేపల్లి పట్టణంలోని స్థానిక మాచర్ల క్రాస్ రోడ్డు నుంచి తంగెడ రోడ్డు వరకు బైక్‌లపై హెల్మెట్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జగదీష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోవటంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనచోదకులంతా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో మాచర్ల రవాణా ఇన్‌స్పెక్టర్ శేషుబాబు, సీఐలు వెంకటరావు, ఆవుల భాస్కర్, పొన్నూరు భాస్కర్, ఎస్ఐలు వినోద్, పాపారావు, సౌదర్‌రాజన్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండలో ప్రకృతి వ్యవసాయం భేష్


ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

బెల్లంకొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలంలో ప్రకృతి వ్యవసాయం చాలా బాగుందని ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ ఆర్గనైజర్ సీనియర్ ఆపరేటర్ స్పెషలిస్టు కే విజయసాగర్ పేర్కొన్నారు. బుధవారం బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిస్తున్న పంటలను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమలకుమారి పాల్గొన్నారు. జీవామృతం, ద్రవ జీవామృతం, విత్తన గుళికలు తయారు చేసి చూపించారు. వాటివల్ల రైతులకు, భూమికి కలిగే ప్రయోజనాలను వివరించారు. భూమిలో వివిధ రకాల పంటలు వేయటం వల్ల జీవ వైవిధ్యం పెరిగి భూమి సారవంత మవుతుందని, చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందని జిల్లా మేనేజర్ అమలకుమారి పేర్కొన్నారు. వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన అనంతరం విజయసాగర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చాలా లాభదాయకమని, అందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌వైఎస్ఎస్ కార్తీక్, సైదయ్య, నందకుమార్, సౌజన్య, ప్రవీణ, పవన్‌కుమార్, అనంతలక్ష్మి, శ్యామ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి

రాజుపాలెం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రైతులందరూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించటం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటలు పండించుకోవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని బీరవల్లిపాయ గ్రామానికి చెందిన రైతు సానే రమణయ్య ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న మిరపపంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ ఆర్గనైజేషన్ సీనియర్ ఆపరేషన్స్ స్పెషలిస్ట్ కె.విజయ్, రైతు సాధికార సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కార్తీక్, అనంతలక్ష్మీ తదితరులు ఉన్నారు.

ఆరుపల్ల విభాగంలో బాపట్ల జిల్లా ఎడ్లజత ప్రథమం


ప్రథమస్థానం సాధించిన బాపట్ల జిల్లా ఎడ్లజత

దుర్గి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దుర్గిలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా స్థానిక వేణుగోపాలస్వామి మాన్యంలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో బుధవారం ఆరుపళ్ల విభాగంలో పోటీలు జరిపారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషాచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 5645 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలెం ఎడ్లజత, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమికి చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లజత 5 వేల అడుగులతో సంయుక్తంగా రెండోస్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్లకు చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్లజత 4500 అడుగులతో మూడోస్థానం, గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం నాగులపాడుకు చెందిన బండి సుస్మితాచౌదరి, వెంకటేశ్వరచౌదరి ఎడ్లజత 4230 అడుగులతో నాలుగోస్థానం, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం వైకొత్తపాలెంకు చెందిన కవులూరి హుస్సేన్‌చౌదరి ఎడ్లజత 3750 అడుగులతో ఐదోస్థానం, పల్నాడు జిల్లా దుర్గి మండలం ధర్మవరానికి చెందిన పెదినీడి శివపార్వతి ఎడ్లజత 2500 అడుగులతో ఆరోస్థానంలో నిలిచాయి. ముఖ్య అతిథిగా మాచర్లకి చెందిన రవితేజ హాస్పిటల్ ఎండీ గోనుగుంట్ల శ్రీకాంత్ హాజరయ్యారు. కటకం రామారావు, గండె గోపాలరావు పర్యవేక్షణలో జరిగిన పోటీల్లో వంకమళ్ల కోటేశ్వరరావు, జనసేన జిల్లా కార్యదర్శి పులి హరి, రుద్రాల రవి, దార్ల రాఘవరావు, సూరె వెంకటేశ్వర్లు, యకటీల చిన్నబ్బాయి, రాళ్లపల్లి శేషయ్య, కోటా రామయ్య, కొత్తా వెంకటేశ్వర్లు, కొండా లచ్చయ్య, లింగా సాంబశివరావు, దొండపాటి వెంకటరమణ, లింగా వెంకటేశ్వర్లు, నాగెండ్ల శ్రీను, గోళ్ల శివయ్య, రిఫరీలు గూడా శ్రీనివాసరావు, బండ్ల ప్రసాద్ పాల్గొన్నారు. గురువారం న్యూ కేటగిరి విభాగంలో పోటీలు జరగనున్నాయి.

ఐదు గ్రామాల్లో భూముల రీసర్వే ప్రారంభం

● రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని ఉన్నతాధికారుల ఆదేశం


అందుకూరులో రీ సర్వే నిర్వహిస్తున్న సర్వే అధికారులు

క్రోసూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గంలో భూముల రీసర్వే ప్రారంభ మైంది. రీసర్వేకు మండలానికి ఒక గ్రామం చొప్పున ఐదు మండలాల్లో రీసర్వేని అధికారులు చేపట్టారు. బెల్లంకొండ మండలం వెంకటాయపాలెంలో 1409.84 ఎకరాల్లోను, క్రోసూరు మండలం అందుకూరులో 1936.30 ఎకరాల్లోను, అమరావతి మండలం నరుకుళ్ళపాడులో 2324.49, పెదకూరపాడు మండలం లింగంగుంట్లలో 2602.33, అచ్చంపేట మండలం కస్తలలో 4035.21 ఎకరాల్లో మొత్తం ఐదు మండలాల్లో 12,308.17 ఎకరాల్లో రీసర్వే చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. జనవరి 10వ తేదీ నుంచి ప్రభుత్వభూముల్లో రీసర్వే ప్రారంభించిన అధికారులు 20వ తేదీ నుంచి ప్రైవేట్, వ్యవసాయ భూముల్లో రీసర్వే ప్రాంభించినట్టు తెలిపారు. నాలుగు నెలల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. రీసర్వే పూర్తయిన తరువాత మిగిలిన గ్రామాల్లో కూడా సర్వే చేపట్టనున్నట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వేలో అనేక తప్పులు దొర్లాయి. వాటిని సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనికోసం ఇటీవల ప్రతి గ్రామంలోను రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఐదు మండలాల్లో కలిపి సుమారు 300 దరఖాస్తుల వరకు అధికారులకు అందగా వాటిలో భూముల వివాదాలకు సంబంధించి 200 దరఖాస్తుల వరకు ఉన్నాయి. రైతుల సమక్షంలోనే భూములకు కొలతలు వేయాలని రీసర్వే అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎంపిక చేసిన గ్రామాల్లో పకడ్బందీగా రీసర్వే ప్రక్రియ చేపట్టినట్టు సత్తెనపల్లి ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి తెలిపారు.

మిరపలో నల్లతామరను నివారించుకోండి :ఏడీఏ

అచ్చంపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణంలో మిరప పంటలో నల్లతామర ఎక్కువగా ఉందని, రైతులు తప్పనిసరిగా వారి పొలాల్లో నీలిరంగు జిగురు అట్టలు ఉంచాలని ఏడీఏ వీ హనుమంతరావు అన్నారు. బుధవారం మండలంలోని చంతపల్లి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఏవో పీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా క్రోసూరు ఏడీఏ హనుమంతరావు రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది శ్రీను నాయక్, మాన్యా నాయక్, రహీం, రైతులు పాల్గొన్నారు.

అందుకూరులో లేగ దూడల ప్రదర్శన

క్రోసూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుకూరులో బుధవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. సుమారు 45 లేగ దూడలను ప్రదర్శనలో ఉంచారు. వాటిలో అందంగా ఉండి, ఆరోగ్యంగా ఉన్న లేగదూడలకు అధికారులు బహుమతులు ప్రకటించారు. ఈ సందర్భంగా పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ కాంతారావు మాట్లాడుతూ పాడి పరిశ్రమను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి గ్రామంలో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామారావు, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ చలపతిరావు, సహాయ సంచాలకులు శివసారథి బాబు, వెటర్నరీ అసిస్టెంట్‌లు కే నాగేశ్వరరావు, డాక్టర్ సీహెచ్ మల్లయ్య పాల్గొన్నారు.

కన్నుల పండువగా మల్లాది వెంకన్న తిరునాళ్ల

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాది గ్రామంలో శ్రీవటవృక్షాంతర్గత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 48వ వార్షికోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. వేలాదిమంది భక్తులు ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం పది గంటలకు పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివార్ల కల్యాణం నిర్వహించారు. భక్తులకు దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ట్రస్టీ ఏలూరి మంగాయమ్మ పర్యవేక్షించగా అమరావతి ఎస్‌హెచ్‌ఓ అచ్చయ్య తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

తూనికలు, కొలతలు అధికారుల దాడులు

రెంటచింతల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతల శాఖ అధికారులు బుధవారం రాత్రి రెంటచింతలలోని వివిధ దుకాణాల్లో తనిఖీలు చేశారు. అసిస్టెంట్ కంట్రోలర్ అల్లూరయ్య నేతృత్వంలో కిరణా దుకాణాలు, ఫ్యాన్సీ, రైస్‌మిల్లులు, గ్యాస్ విక్రయాల దుకాణాలపై దాడులు జరిపి కేసులు నమోదు చేశారు. నిండు సిలిండర్‌లో అర కేజీ గ్యాస్ తగ్గడంతో రూ.10వేలు, రైసుమిల్లులో బస్తాలో కేజీ బియ్యం తగ్గడంతో రూ.10వేల అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీలో ఇన్‌స్పెక్టర్ సైదా తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డున్న ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలి

జాబ్ కార్డున్న ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలని ఎంపీడీవో కె.సరోజనిదేవి కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 100 రోజుల పనిదినాలకు గాను రోజుకు రూ.300 అందించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. డ్వామా పీడీ మూర్తి ఆదేశాల మేరకు 5 గ్రామాల ఎఫ్ఏలకు షోకాజు నోటీసులు జారీచేశారు. సమావేశంలో ఏపీవో జయచంద్ర, ఎఫ్ఏలు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్

వినియోగదారుడి సమస్య తీరుస్తాం

● మెరుగైన విద్యుత్‌ను అందిస్తాం
● సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్

రాజుపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యుత్ వినియోగదారుడి సమస్యను పరిష్కరించే దిశగా విద్యుత్‌శాఖ పనిచేస్తుందని కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ తెలిపారు. బుధవారం కొండమోడు సబ్‌డివిజన్ కార్యాలయంలో వినియోగదారుల విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సబ్‌డివిజన్ పరిధిలోని పలువురు విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. మాచర్ల డివిజన్‌లో 34మంది విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్నింటిని 15 రోజుల్లో పరిష్కరించాలని పల్నాడు జిల్లా ఎస్ఈ పి.విజయకుమార్ అధికారులను ఆదేశించారు. గ్రామీణప్రాంతాలలో పనిచేసే విద్యుత్‌శాఖ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ తెలిపారు. కేటగిరి-2, 3 విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను బిగించినట్లైతే విద్యుత్ ఆదా చేసుకోవడంతో పాటు పెనాల్టీ నుండి తప్పించుకోవచ్చన్నారు. సమావేశంలో మాచర్ల ఈఈ నూతలపాటి సింగయ్య, పిడుగురాళ్ల డీఈ నాగసురేష్‌బాబు, డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత మాచర్లకు కృషి చేద్దాం

● మున్సిపల్ చైర్మన్ నరసింహారావు


మాట్లాడుతున్న చైర్మన్ నరసింహారావు

మాచర్లటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత మాచర్ల పట్టణం ఏర్పాటుకు అందరం కృషి చేద్దామని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. బుధవారం స్థానిక పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో పట్టణంలోని వ్యాపారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ నరసింహారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకం వలన సైడు కాలువల్లో మురుగు పారుదలకు ఇబ్బంది తలెత్తుతోందన్నారు. పశువులు ప్లాస్టిక్ కవర్లు తింటుండడంతో అవి మరణించే ప్రమాదముందన్నారు. వ్యాపారులు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, తుమ్మెపల్లి సాంబశివరావు, కంభంపాటి గాలేశ్వరరావు, దేవకి వెంకటశేషు, కొత్తమాసు వీరాంజనేయులు, కాసుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్తంభం పైనుంచి పడి.. ప్రైవేటు లైన్‌మన్‌కు గాయాలు

మాచర్ల రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పొలంలో విద్యుత్ పోలు పై నుంచి జారిపడి ప్రైవేటు లైన్‌మన్‌కు తీవ్రగాయాలైన సంఘటన మాచర్ల మండలం లింగాపురంలో మంగళవారం జరిగింది. వెల్దుర్తి మండలం ఉప్పలపాడుకు చెందిన ఆవులమంద శ్రీను ప్రైవేటు లైన్‌మన్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం లింగాపురంలో వీర్ల కొండలు అనే రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించి ఎడ్జ్ ఫీజులు బిగించేందుకు ఎల్‌సీ తీసుకున్నాడు. ఎడ్జ్ ఫీజు బిగిస్తుండగా విద్యుత్ షాక్ తగిలి పడిపోయాడు. ఈ సంఘటనలో శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే జూనియర్ లైన్‌మ్యాన్ కొర్రా సొమ్యానాయక్ క్షతగాత్రుడ్ని మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం నరసరావుపేటలోని జీబీఆర్ హాస్పిటల్‌కు తరలించారు. శ్రీనుకు వెన్నుమూసకు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు పేర్కొన్నారు.

26న నకరికల్లులో మహిళలు, పురుషుల ఖోఖో జట్ల ఎంపిక

నకరికల్లు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నకరికల్లు జడ్పీ హైస్కూల్లో ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మహిళల, పురుషుల ఖోఖో జట్లను ఎంపిక చేయనున్నట్టు సెక్రటరీ చింతా పుల్లయ్య తెలిపారు. ఎంపికల్లో పాల్గొనేవారు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. పాల్గొనేవారికి ఎలాంటి వయోపరిమితి లేదన్నా రు. ఉమ్మడి గుంటూరు జిల్లాల మహిళల, పురుషుల ఖోఖో జట్లు ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో ప్రకాశం జిల్లా జే పంగులూరులో రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు సెల్ 9866925108లో సంప్రదించాలన్నారు.

26న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

సత్తెనపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 26వ తేదీన అరుణాచలానికి ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటుచేసినట్టు డిపో మేనేజర్ విజయకుమార్ బుధవారం విలేకర్లకు తెలిపారు. 26వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు బస్సు బయలుదేరి 27 తెల్లవారుజామున అరుణాచలం చేరుతుందన్నారు. దర్శనం అనంతరం తిరిగి కంచి మీదుగా 28వ తేదీ ఉదయం సత్తెనపల్లి చేరుతుందని తెలిపారు. రానుపోను టిక్కెట్ ధర రూ 2100 అన్నారు. నియోజకవర్గంలోని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 99592 25429 నెంబరులో సంప్రదించాలన్నారు.

బయటపడుతున్న బోగస్ పింఛన్‌లు

● వచ్చే నెల నుంచి అనర్హులకు పంపిణీ నిలిపివేత

సత్తెనపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, అవకతవకలు బయటపడుతున్నాయి. పార్టీకి చెందినవారిని, డబ్బు ముట్టజెప్పినవారిని లబ్ధిదారులుగా చేర్చి సంక్షేమపథకాల కింద వేలాది రూపాయల ప్రభుత్వసొమ్మును ప్రతినెల ఇచ్చినట్టు ఆధారాలతో వెలుగుచూస్తున్నాయి. పింఛన్‌ల పథకమే ఇందుకు నిదర్శనం. ఎన్‌టీఆర్ భరోసా కింద ఇస్తున్న ఆరోగ్య పింఛన్‌లలో తవ్వేకొద్ది అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. సత్తెనపల్లి నియోజకవర్గంలో వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు పింఛన్‌లు తీసుకొనేవారి వివరాలపై డాక్టర్ల బృందం ప్రత్యేకంగా సర్వే నిర్వహిస్తున్నది. సత్తెనపల్లిలో 8, మండలంలో 47, రాజుపాలెం మండలంలో 30, ముప్పాళ్ళ మండలంలో 25, నకరికల్లు మండలంలో 54 పింఛన్‌లపై తనిఖీలు చేస్తుండటంతో అనర్హులు బయటపడుతున్నారు. కొంతమంది తప్పుడు సదరన్‌సర్టిఫికెట్లు సమర్పించి రూ.15వేల వరకు పింఛన్‌లు పొందుతున్నారు. 2019-2024 మధ్య సత్తెనపల్లి ఏరియావైద్యశాల నుంచి పలువురు అనర్హులు సదరన్ సర్టిఫికెట్లు పొంది పింఛన్‌లు పొందుతున్నారు. ఆరోగ్యంగా ఉన్నవారికి కూడా దివ్యాంగుల కింద నెలవారి పింఛన్‌లు అందుతున్నట్టు గుర్తించారు. 40శాతంకు పైగా బోగస్ పింఛన్‌లు ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. వీరికి ఫిబ్రవరి నుంచి పింఛన్ కట్‌చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం.

రెంటచింతలకు మరో మద్యం దుకాణం

రెంటచింతల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మరో ఎన్నికల హామీని నెరవేర్చింది. కల్లుగీత కార్మికులకు మద్యం షాపు కేటాయించింది. రెంటచింతలలో ఇప్పటికే రెండు షాపులుండగా మరో షాపు రానుంది. ఈ మేరకు నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు. మండలంలో 52వేల జనాభాతో 11 గ్రామాలుండడంతో మరో షాపు ఏర్పాటుకు వీలు కలిగింది. ప్రైవేట్ లైసెన్స్‌దారులుగా కమిషన్ చెల్లిస్తారు. దరఖాస్తు చేసేవారు స్థానికుడై వుండాలి. ప్రతి దరఖాస్తుకు రూ.2లక్షలు చెల్లించడంతో పాటు లాటరీ ద్వారా షాపు కేటాయిస్తారు. ప్రస్తుతం 9 శాతం కమీషన్ ఇస్తుండగా త్వరలో 14శాతానికి పెంచనున్నారు.




ఇసుకపల్లిలోని బేతపూడిరోడ్డులో మహా ప్రస్థానం


26వార్డులోని మౌంట్‌ఫోర్టురోడ్డులో నిర్మించిన మహా ప్రస్థానం ముఖద్వారం

సమాజసేవలో..

విశ్రాంత ఉపాధ్యాయుడు

దాతల సహకారంతో రెండు శ్మశానాల అభివృద్ధి

రేపల్లెలో సుందరవనాలుగా తీర్చిదిద్దిన సుబ్రహ్మణ్యం

రేపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ కాలంలో అలసిపోయి.. విరమణ అనంతరం విశ్రాంతి తీసుకోవాలని అందరూ భావిస్తారు. అయితే ఆయన ఉద్యోగ విరమణ అనంతరం సమాజసేవలో తరిస్తున్నారు. ఆ సేవ కూడా శ్మశానవాటికల అభివృద్ధితో తరిస్తున్నారు. ప్రతి మనిషి జీవన పోరాటంలో కాలంతో పరుగులు పెడుతూ మరణానంతరం తుది మజిలీ స్థలం ప్రశాంతత కలిగించేదిగా


మహాప్రస్థానంలో వెల్లివిరుస్తున్న పచ్చదనం

ఉండాలని రేపల్లెకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం భావించారు. అనుకున్నదే తడవుగా దాతల సహకారంతో శ్మశానవాటికలను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించుకున్నారు. 35 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులను భారత పౌరులుగా తీర్చిదిద్దారు. విరమణ అనంతరం సమాజసేవపై దృష్టి సారించి ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్న లక్ష్య సాధనలో భాగంగా సంచార వైద్యశాల ద్వారా సేవలు అందించారు. పట్టణంలోని ఇసుకపల్లి బేతపూడిరోడ్డులో హిందూ శ్మశానవాటిక పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారింది. దహన సంస్కారాలకు వీలులేకుండా ఉంది. దీంతో ఎలాగైనా శ్మశానవాటికను మహాప్రస్థానంగా చేయాలనే ఉద్దేశంతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఒక్కొక్క శ్మశానవాటికలో 5.50 ఎకరాలు రెండు కలిపితే 11 ఎకరాల స్థలంగా శ్మశానవాటికగా గుర్తించారు. దాతల సహకారంతో రూ.2 కోట్లతో రెండు శ్మశాన వాటికలను సుందర ఉదాన్యవనాలుగా తీర్చిదిద్దారు. దీనికి మహా ప్రస్థానంగా నామకరణం చేశారు. ప్రస్తుతం మహా ప్రస్థానంలో పనులు పూర్తికాగా వాటిల్లో స్వర్గధామం చేసేందుకు రెండు స్వర్గారోహణలు, భవనం, కాంక్రీట్ రోడ్లు, అపరకర్మశాల, స్నానపు గదులు, ప్రహరీ, పచ్చని ఉద్యానవనం, ఓ మార్చురీ భవనం, ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా భారీ పరమేశ్వరుడి విగ్రహం, కాటికాపరిగా సత్య హరిశ్చంద్రుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ముఖద్వారానికి పరమేశ్వరుడి విగ్రహాలు ఏర్పాటు చేసి శ్మశానవాటికను సుందరంగా తీర్చిదిద్దారు.


మహాప్రస్థానంలో అన్నిహంగులతో నిర్మించిన అపరకర్మశాల

సేవా కార్యక్రమాల్లో గుర్తింపు..

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా మూడు పర్యాయాలు చేసి రాష్ట్రంలోనే ఉత్తమ అధ్యక్షుడిగా అవార్డులు, ప్రశంసాపత్రాలను జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం అందుకున్నారు. ఉప్పూడి రోడ్డులో అర్బన్‌హెల్త్ సెంటర్ అధ్యక్షుడిగా పని చేసి గుంటూరు జిల్లాలోని సేవా కార్యక్రమాల్లో మొదటి స్థానంలో నిలిచారు. సేవలకు గుర్తింపుగా అప్పటి కలెక్టర్ ఆంజనేయులు, మంత్రి కన్నా లక్ష్మీనారాయణల నుంచి అవార్డు అందుకున్నారు. విజయవాడ, కాకినాడ, ఒంగోలులో జరిగిన జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచారు. ఇసుకపల్లిలోని బేతపూడి రహదారిలో ఉన్న శ్మశానవాటిక కూడా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టి పార్కులను తలపించేలా అన్నిహంగులతో కూడిన మహాప్రస్థానాలను నిర్మించారు. లయన్స్‌క్లబ్‌లో సేవారత్న బిరుదు పొందారు. లయన్స్‌క్లబ్‌లో ఐదురాష్ట్రాల్లో మల్టిబుల్ బెస్టు సెక్రటరీగా ఎన్నికయ్యారు. బాల్‌బ్యాడ్మింటన్‌లో జాతీయస్థాయిలో అవార్డులు పొందారు.

పశుగ్రాసానికి ఇక్కట్లు

ఎకరం ఎండుగడ్డి రూ.13 వేలు

గ్రాసం దొరక్క పశు పోషకులు అవస్థలు

దుగ్గిరాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం కొరత నానాటికి పెరుగుతోంది. పశుపోషకులు నానా అవస్థలు పడుతున్నారు. అకాల వర్షాలు, తుపాన్ల భయంతో రైతులు యంత్రాలపై ఆధారపడి వరి కోతలు చేసుకున్నారు. దుగ్గిరాల పరిసర గ్రామాల్లో వరికుప్పలు వేసే వారు మచ్చుకైనా కాన రావడంలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పరిసరాల్లోని కృష్ణాజిల్లా నుంచి ఎకరం రూ.13 వేల చొప్పున గడ్డి కొనుగోలు చేయాల్సి వస్తోంది. తెనాలి పరిసరాల్లో జంపని, అమృతలూరు, గోవాడ తదితర గ్రామాల్లో వరికోత కోసి కుప్పలు వేస్తున్నప్పటికీ, రెండు మూడునెలల తర్వాత నూర్పిడి అనంతరం గడ్డి విక్రయిస్తున్నారు. ఈలోగా పశుపోషకులు రెట్టింపు ధరకు గడ్డి కొనుగోలు చేయాల్సి వస్తోంది. కాగా యంత్రాలతో కోసిన గడ్డి దిండు రూ.100 వరకూ పలుకుతోంది. గతంలో వరికోసి ఓదెలు వేసి, పూర్తిగా ఆరిన తర్వాత పొలంలోనే పంటను ట్రాక్టర్ల తొక్కించగా వచ్చిన గడ్డిని ఒకచోటకు పోగుచేసి, అనంతరం మోపులుగా చేసి పశువుల చావిడివద్ద లేదా పొలంలోనే వాములను వేసేవారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి మచ్చుకు ఎక్కడా కనిపించడంలేదు. ఒక్కో గేదెకు ఎకరం నుంచి ఒకటిన్నర ఎకరం వరకు గడ్డి అవసరమవుతుంది. గతంలో కాల్వగట్లపైన పంటలు వేస్తుండటంతో పచ్చిమేత దొరికేది. అయితే ఇప్పుడు అది కూడా లేకుండా పోయింది. ఇటీవలి యంత్రాలతో వరి నూర్పిడి చేస్తుండటంతో పశుగ్రాసం కొరత పశుపోషకులను వేధిస్తోంది. కొందరు బ్యాంకు రుణాలతో గేదెల ఫారాలను నిర్వహించినప్పటికీ పశుగ్రాసం కొరతతో పోషకులు అల్లాడుతున్నారు. కొందరైతే గేదెలను వచ్చిన ధరకు తెగనమ్ముకుని పీకలోతు నష్టాలతో ఫారాలను కూడా ఎత్తివేశారు.

భారంగా గేదెలపోషణ



పశుగ్రాసం కొరతతో గేదెల పోషణ భారంగా మారింది. తక్కువ ధరకు పశుగ్రాసం తోపాటు, పశువుల దాణాను అందించేం దుకు చర్యలు తీసుకోవాలి. పచ్చిగడ్డి కోసం గతంలో పొలాల్లో కొంతభాగం వదిలేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వకుంటే, భవిష్యత్‌లో గేదెల పోషణ కష్టమే.

-ఎద్దు వీరయ్య, దుగ్గిరాల


దుగ్గిరాలలో పశుపోషకుల ఇండ్లకు తరలి వెళుతున్న గడ్డిలోడు ట్రాక్టర్


మంచికలపూడి సమీపంలో వరినుంచి వచ్చిన గడ్డితో చుట్టిన గడ్డిదిండ్లు

రక్షణ గోడకు అనుమతి

- కుడి కరకట్టకు.. రూ.294.20 కోట్లు మంజూరు
- త్వరలో టెండర్ల నిర్వహణకు అధికారులు సిద్ధం

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది కుడి కరకట్టకు సంబంధించి ప్రకాశం బ్యారేజ్ దిగువన 0.900 కిలోమీటర్ నుంచి 2.610 కిలోమీటర్ వరకు తాడేపల్లి మండల పరిధిలో వరద రక్షణ గోడ నిర్మాణానికి పరిపాలన అనుమతి మంజూరైంది. రూ.294.20 కోట్లకు పరిపాలన అనుమతి మంజూరు చేస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరి సాయిప్రసాదు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో త్వరలోనే టెక్నికల్ శాంక్షన్స్ తీసుకుని టెండర్లు పిలిచి ఏజెన్సీని ఖరారు చేస్తారు. అనంతరం వరద రక్షణ గోడ నిర్మాణ పనులను ప్రారంభిస్తారు. ఈ గోడ నిర్మాణం పూర్తి అయితే తాడేపల్లికి రాబోయే రోజుల్లో వరద నీటి ప్రవాహం నుంచి ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు. బ్యారేజ్ దిగువన 900 మీటర్ల వద్ద నుంచి దాదాపుగా కిలోమీటర్‌న్నర దూరం వరకు తగిన వరద కట్ట లేదు. దీంతో ఏటా కృష్ణానది నుంచి వరద సమయంలో నీటిని విడుదల చేయగానే ఆ ప్రదేశం నీట మునిగిపోతున్నది. మహానాడు కాలనీలో దాదాపుగా రెండు వేలకు పైగా ఇళ్లు ఉండగా 10 వేల మంది వరకు జనం నివసిస్తున్నారు. కృష్ణానదికి వరద వస్తుందని తెలియగానే వీరంతా భయంతో ఇళ్లల్లో సామాన్లు వదిలేసి పునరావరాస కేంద్రాలకు వెళ్లి తలదాచుకుంటూ ఉండటం పరిపాటిగా మారింది. వరదలో ఇళ్లల్లో ఉన్నవన్నీ తుడిచి పెట్టుకుపోతుంటాయి. ఇప్పటివరకు విజయవాడ వైపునే రిటైనింగ్ వాల్స్ నిర్మించారు తప్ప గుంటూరు వైపు పాలకులు పట్టించుకోలేదు. నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి అయ్యాక ప్రధానంగా దీనిపై దృష్టి పెట్టారు. భవిష్యత్తులో వరద ముప్పు లేకుండా చేయాలని రిటైనింగ్ వాల్‌ని ప్రతిపాదించారు. ఇందుకు ఇటీవలే రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో బుధవారం జలవనరుల శాఖ పరిపాలన అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. టెక్నికల్ శాంక్షన్ జారీ చేసే ముందు సెంట్రల్ డిజైన్స్ ఆర్గనేజేషన్ నుంచి అనుమతి పొందిన డ్రాయింగ్స్‌ని తీసుకోవాలని స్పెషల్ సీఎస్ ఆదేశించారు. జీవో 37 ప్రకారం సీనరేజ్ చార్జీలు వర్క్ అవుట్ చేయాలన్నారు. విజయవాడ కృష్ణా డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీరుకు అన్ని బాధ్యతలు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు.


తాడేపల్లి మహానాడు ఏరియాలో వరద దృశ్యం (పాతచిత్రం)

మిర్చియార్డు

ఈ-నామ్‌లో కానరాని టిక్కీలు

లాట్ ఐడీల ఆధారంగా వ్యాపారులకు నోటీసులు

4 లక్షల టిక్కీల గల్లంతు



గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో అమల్లో ఉన్న జాతీయ వ్యవసాయ మార్కెట్(ఈనామ్) విధానంలో దాదాపుగా నాలుగు లక్షల మిర్చి టిక్కీలు గల్లంతయ్యాయి. గేట్ వద్ద ఎంట్రీ జరిగిన లాట్ ఐడీలు క్లియర్ కాలేదు. బిడ్డింగ్ వేయడం ఆ తర్వాత వదిలేయడం, అలా వదిలేసిన టిక్కీలకు మరో లాట్ ఐడీ జనరేట్ చేయించుకుని వేరొక వ్యాపారి కొనుగోలు చేయడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైనట్లుగా అధికారులు గుర్తించారు. ప్రస్తుతం యార్డులో ఎలాంటి నిల్వలు లేవు. దాదాపుగా ఏడు, ఎనిమిదేళ్ల క్రితమే ఇది అమల్లోకి వచ్చినా నేటికీ లోపాలు బయట పడుతూనే ఉన్నాయి. ఆన్‌లైన్ విధానం ఏమాత్రం అమలు కావడం లేదు. అన్ని ఆఫ్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. ఇందుకు తాజా ఉదాహరణే లాట్ ఐడీల వేల సంఖ్యలో పెండింగ్‌లో ఉండటమే. వ్యాపారులు తొలత బిడ్డింగ్‌లో ప్రదర్శితమైన లాట్‌ని దక్కించుకుంటున్నారు. ఆ తర్వాత తమకు వేరే నాణ్యమైన సరుకు లభ్యమైందని ఆ బిడ్డింగ్‌ని వదిలేస్తున్నారు. ఇలా వదిలేసిన మిర్చి టిక్కీలకు వేరే లాట్ ఐడీలు జనరేట్ చేసి వేరొకరు బిడ్డింగ్‌లో దక్కించుకుంటున్నారు. దీంతో దాదాపుగా 4 లక్షల టిక్కీలు నేటికీ ఈనామ్‌లో బిడ్డింగ్ జరగకుండా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మిర్చియార్డుకు మార్కెట్ ఫీజు రూపంలో దాదాపుగా రూ.3 కోట్లు పెండింగ్ చూపిస్తున్నది. దీనంతటికి కారణం మిర్చియార్డులో కమీషన్ ఏజంట్ లైసెన్స్ పొందిన వ్యాపారులేనని అధికారులు గుర్తించారు. ఎవరైతే ఈ అసంబద్ధమైన విధానాలను అవలంభించారో వారికి నోటీసులు జారీ చేసే ప్రక్రియని ప్రారంభించారు. నోటీసులకు తగిన వివరణ ఇవ్వకపోతే మీ లైసెన్సులు ఎందుకు రద్దు చేయకూడదో తెలియజేయాలన్నారు. రెండు, రోజులుగా నోటీసులు అందుకుంటున్న వ్యాపారులు వాటిని చూసి భయపడిపోతున్నారు. ఈ నోటీసులపై అసోసియేషన్‌లో చర్చించుకుని ఒక నిర్ణయానికి రావాలని భావిస్తున్నారు.

అప్పులు చేసి వ్యాపారి అదృశ్యం

దాచేపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డబ్బులు తీసుకున్న వ్యాపారి కన్పించటం లేదన్న సమాచారంతో రుణదాతలు బుధవారం వ్యాపారి షాపు వద్ద గుమ్మికూడారు. వ్యాపారికి అప్పులు ఇచ్చిన రుణదాతల్లో సామాన్య రైతులు అధికంగా ఉన్నారు. గత 30 ఏళ్లుగా వ్యాపారి ఆ రైతులతో లక్షల రూపాయల లావాదేవీలు చేస్తూ నమ్మకంగా ఉన్నారు. గత రెండేళ్ల నుంచి వ్యాపారి రుణదాతలకు డబ్బులు చెల్లించకుండా కాలక్షేపం చేస్తూ వాయిదాలు వేస్తున్నాడు. దాచేపల్లిలో ఉంటున్న వ్యాపారికి చుట్టు పక్కల గ్రామాలైన మాదినపాడు, సారంగపల్లి అగ్రహారం, గోగులపాడు, తక్కెళ్ళపాడు, దాచేపల్లి పట్టణం, నడికుడి గ్రామాలకు చెందిన రైతులు, చిరు వ్యాపారులు, ఉద్యోగస్తులు, తోటి వ్యాపారులు లక్షల్లో అప్పు ఇచ్చారు. వ్యాపారస్తుడు, రుణదాతలకు సుమారుగా రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు రుణాలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పుకుంటున్నారు. ఇప్పటికే దాచేపల్లి మండలంలోని ముత్యాలంపాడులో ఓ వ్యాపారస్తుడు తొమ్మిది కోట్ల రూపాయలు, మాదినపాడులో మరో కోటి రూపాయలు, దాచేపల్లిలో చిట్టీ పాటల నిర్వాహకురాలు రూ.2 కోట్లు, ఎరువుల కొట్టు వ్యాపారి మరో కోటి రూపాయలు రుణాలు తీసుకొని కన్పించకుండా పోయారు. కోట్ల రూపాయల డబ్బులు తీసుకొని కన్పించకుండా పోతుండటంతో సామాన్య ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

వరికపూడిశెల నిర్మాణాన్ని మరిచిన ప్రభుత్వం

- సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి మధు


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి మధు

వినుకొండటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా అభివృద్ధికి ప్రామాణికంగా నిలిచే వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని మాజీ రాజ్యసభ సభ్యుడు, సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి మధు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు వరికపూడిశెల అభివృద్ధిపై ఉపన్యాసాలు ఇచ్చిన నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత దాని ఊసే ఎత్తకపోవడం శోచనీయమని అన్నారు. వరికపూడిశల ప్రాజెక్టు నిర్మాణం చేపడితే లక్షా 20 వేల ఎకరాలకు సాగు నీరు, ప్రజలకు తాగునీరు అందుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరికపూడిశల ప్రాజెక్టు నిర్మాణంపై చొరవ తీసుకోవాలని సూచించారు. ఎన్నికల హామీల్లో భాగంగా వ్యవసాయం కోసం పెట్టుబడిగా రైతులకు రూ. 20 వేలు ఇస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. జగన్ అధానితో చేసుకున్న 25 సంవత్సరాల సతీ విద్యుత్ ఒప్పందాన్ని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం రూ.1740కు మద్దతు ధరతో కొనుగోలు చేయాలని, దళారుల నుంచి రైతులను ఆదుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని, వారి విధానాలు మార్చుకోకపోతే రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు హనుమంతరెడ్డి, సీపీఎం వినుకొండ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు, నాయకులు శివరామకృష్ణయ్య, వెంకటప్పయ్య, పెనుమాళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆలయంలో ఆభరణాల చోరీ

అమృతలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీభావన్నారాయణ స్వామి ఆలయంలో చోరీ జరిగినట్లు ఎస్ఐ హర్షవర్ధన్ బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి స్వామి వారి నివేదన సమర్పించిన అనంతరం అర్చకులు ఆలయానికి తాళాలు వేశారు. బుధవారం ఉదయం స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించే నిమిత్తం అర్చకులు ఆలయానికి వచ్చారు. ఆలయం తలుపుల గడులు కోసి ఉండటంతోపాటు సీసీ కెమెరాల వైరు కత్తిరించి ఉండటం గమనించి వారు ఆలయ ఈవో శివరామకృష్ణకు, పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ఆలయంలో పరిశీలించగా బావన్నారాయణ, రాజ్యలక్ష్మి అమ్మవార్ల వెండి కిరీటాలు, కర్ణపత్రాలు, వెండి చేతులు, మకరతోరణం, అమ్మవారి బంగారు సూత్రాలతోపాటు స్వామి వారి సమస్త వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలను సేకరించారు. ఆలయ ఈవో శివరామకృష్ణ, అర్చకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జె. సూర్యప్రకాశరావు ఆలయంను సందర్శించారు. చోరీ వివరాలను తెలుసుకున్నారు.


వేలి ముద్రలు పరిశీలిస్తున్న ఎస్ఐ హర్షవర్ధన్, క్లూస్ టీమ్

ఇసుక రేవుల్లో.. ఉద్యోగాలంటూ వల

- ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా నిరుద్యోగులకు ఆశ
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన దళారుల పోస్టులు
- పోస్టులు పెట్టిన వారు ఎవరని ఆరా తీస్తున్న అధికార యంత్రాంగం
- ఇలాంటి ప్రకటనలు నమ్మి మోసపోవద్దని మైనింగ్ శాఖ డీడీ సూచన

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇసుక రేవుల్లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు కొంతమంది దళారులు కొద్ది రోజుల నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వల విసురుతున్నారు. వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా సందేశాలు పంపిస్తున్నారు. ప్రభుత్వం/జిల్లా స్థాయి ఇసుక కమిటీ నేరుగా నియామకాలు జరుపుతున్నదని నమ్మిస్తున్నారు. ఒక విధంగా ప్రభుత్వ ఉద్యోగమేనని చెబుతుండటంతో దళారులు అడిగినంత ముట్టజెప్పేందుకు నిరుద్యోగులు సిద్ధపడుతున్నారు. ఈ విషయం ఎట్టకేలకు మైనింగ్ డిపార్టుమెంట్ డైరెక్టర్‌కు చేరడంతో ఆయన వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టులను పంపించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దాంతో కలెక్టర్ తరపున మంగళవారం మైనింగ్ శాఖ డీడీ ధూళిపాళ వెంకటసాయి ఒక ప్రకటన జారీ చేస్తూ ఇలాంటి ప్రకటనలు నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. అసత్య ప్రచారాలు ఎవరి ఐడీల నుంచి పోస్టు అయ్యాయనే వివరాలను సేకరిస్తున్నామని, వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఇసుక మైనింగ్ ఆపరేషన్స్ జోరుగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం పలుచోట్ల ఇసుక స్టాక్‌యార్డులను ఏర్పాటు చేసి అక్కడి నుంచి ఇసుక సరఫరా చేస్తున్నది. ఇదే అదనుగా ఆయా స్టాక్‌యార్డుల్లో కంప్యూటర్ ఆపరేటర్, ఇసుక లోడింగ్ వాహనాల ఆపరేటర్ వంటి అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయంటూ దళారులు నిరుద్యోగులను వలలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వపరంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగమైనా సరే నమ్మకంగా జీతభత్యాలు వస్తాయని భావిస్తూ దళారులు అడుగుతున్న ఒక్కో పోస్టుకు రూ.2 లక్షలు ముట్టజెప్పేందుకు అమాయకులు సిద్ధపడిపోతున్నారు. కాగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో ఇలాంటి పోస్టులు ఎవరు పోస్టింగ్ చేస్తున్నారనే దానిపై ఆరా తీస్తున్నారు. ఇందుకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నిందితులను పట్టుకునే ప్రయత్నాలను ప్రారంభించారు. ఇలాంటి పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. నిరుద్యోగులు ఎవరూ మోసపోవద్దని, ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని వస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఏదైనా ఉద్యోగ నియామకాలు చేపడితే నిబంధనల ప్రకారం చేస్తుందని చెప్పారు.



డ్వాక్రా మహిళలందరూ అక్షరాస్యులుగా మారాలి

● ఎంపీడీవో ఉమాదేవి

నూజెండ్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు అందరూ అక్షరాస్యులుగా మారి బ్యాంక్ లావాదేవీలను సమర్థవంతంగా నిర్వహించి సంతకాలు చేసేలా మారాలని ఎంపీడీవో పీ ఉమాదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం డీఆర్‌డీఏ వెలుగు ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమాన్ని నర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా శ్రీనిధి ఏజీఎం ఆర్ చినబుల్లెయ్య, ఏపీఎం ఎస్.రామాంజనేయులు, మండల సమాఖ్య అధ్యక్షురాలు జీ సుజాత, సీసీలు కొండలు, వెంకటరావు, హనుమంతరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వ్యాపారులు లైసెన్స్ ఫీజులు చెల్లించాలి: కమిషనర్

వినుకొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపారులు, ఖార్ఖానాలు, గోడౌన్‌లు వర్క్‌షాపులకు వినుకొండ పురపాలక సంఘానికి చెల్లించాల్సిన డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్, వ్యాపార రుసుములు తప్పనిసరిగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్ర బోస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తషాపులతోపాటు పాత బకాయిలు తప్పనిసరిగా చెల్లించాలని, లేకుంటే చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

నేడు మరియ, జోజప్పల చర్చి తిరునాళ్ళ

నాదెండ్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్రు గ్రామంలోని పునీత మరియ, జోజప్పల కల్యాణ నిశ్చిత్తార్ధ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. గుంటూరు ఆర్‌సీఎం పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్యతో పాటు పలువురు మత గురువులు దివ్య పూజాబలి సమర్పించనున్నారు. మధ్యాహ్నం నుంచి కొవ్వొత్తుల సమర్పణ, రాత్రి తేరు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఫాదర్ పగడాల చిన్నప్ప తెలిపారు.

పల్లె పండుగ పనుల పరిశీలన

నూజెండ్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంజూరైన అభివృద్ధి పనులను ఎంపీడీవో పీ ఉమాదేవి బుధవారం పరిశీలించారు. తెల్లపాడులో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీవో ఆంజనేయ రాజు, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్‌రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు

రొంపిచర్ల, జనవరి 22 (ఆంధ్రజోతి): మండలంలోని మునమాక, ముత్తనపల్లి గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటను పరిశీలించి ఏవో శివ లలిత రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని సాతులూరు, గొరిజవోలు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం శివకుమారి మాట్లాడుతూ పూత, పిందె దశలో ఉన్న శనగ పైరుకు మల్టీకే 13.0.45 ఫార్ములా-4 ఐదు వందల గ్రాములు కలిపి ఎకరానికి కిలో చొప్పున పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ మస్తానమ్మ, ఏవో హరి ప్రసాదు, కార్యదర్శి రాఘవయ్య, ఏఈవో జీవన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా నూతన కమిటీ ఎంపిక

వినుకొండటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా మహంకాళి సుబ్బారావు, కార్యదర్శిగా షేక్ సుభానీలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శివయ్య భవన్‌లో ఏఐవైఎఫ్ ప్రథమ మహాసభ సందర్భంగా సభ్యులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. తొమ్మిది మంది సభ్యులతో జిల్లా కౌన్సిల్ సభ్యులను ఎంపిక చేశారు. అనంతరం సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో పెద్దఎత్తున నిరుద్యోగ యువకులను సమీకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ఈ సందర్భంగా తెలిపారు.

నూజెండ్లలో వైద్య శిబిరం

నూజెండ్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నూజెండ్లలో వినుకొండ విజయ్ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో డాక్టర్ మక్కెన ప్రసన్న ఉచిత వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు, పెద్దలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

పశువులకు వైద్య పరీక్షలు

రొంపిచర్ల, జనవరి 22 (ఆంధ్రజోతి): మండలంలోని ఎడ్వర్డుపేట, బుచ్చిపాపన్నపాలెం గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను బుధవారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఆ శిబిరాలను ప్రారంభించారు. నట్టల నివారణ, బొబ్బ టీకాలు, కోళ్ళకు టీకాలు వేశారు.

● యడ్లపాడు: రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణతో అదనపు ఆదాయాన్ని పొందవచ్చని యడ్లపాడు ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వై రాధాకృష్ణ అన్నారు. జగ్గాపురం పశు ఆరోగ్య కేంద్రం పరిధిలోని జాలాదిలో పశు ఆరోగ్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు లిఖిత, సాయిగోపికృష్ణ, గోపాలమిత్ర ఎస్.వరప్రసాద్, సహాయకులు చక్రవర్తి, రైతులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పశు ఆరోగ్య వైద్య శిబిరాలను నిర్వహించారు. నాదెండ్లలో వైద్య శిబిరాన్ని సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి, సొసైటీ మాజీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు ప్రారంభించారు. 469 పశువులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఏడీ వై రాధాకృష్ణయ్య శిబిరాన్ని తనిఖీ చేశారు.

బడిని చూడని బాల్యం

● పలకా బలపం పట్టాల్సిన చిన్నారులు చెరువుగట్లపై జీవనం
● రెక్కాడితే కాని డొక్కాడని స్థితిలో తల్లిదండ్రులు
● సంచార జీవితంతో అటకెక్కిన చదువులు
● చిన్నారులకు ఆసరా కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు


చెరువు గట్లపై నివాసం ఉంటున్న పలకా, బలపం పట్టని చిన్నారులు


మంచులో చలికాచుకుంటున్న నిరుపేదలు

వినుకొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నీడనిచ్చే చెట్లే నివాస గృహం... చెరువే జీవనాధారం... పాత చీరలే వారి శరీరానికి ఆచ్ఛాదన. ప్రభుత్వం బడి బాట అంటూ ఎన్ని పథకాలు పెట్టినా వారి జీవనశైలితో చిన్నారులు బడి ముఖం చూడకుండానే, పలకా, బలపం పట్టకుండానే వారి జీవితాలు సాగిపోతున్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వారి దరిచేరక పసిపిల్లల జీవితాలు కొవ్వొత్తిలా కరిగిపోతున్నాయి. పొట్ట నింపుకోవడం కోసం తల్లిదండ్రులు పొలం బాట పడితే, పలక బలపం పట్టాల్సిన చిన్నారులు చెరువుగట్టుపై కాలం గడుపుతున్నారు. అన్యం, పున్యం ఎరుగని బాల్యం... పాఠశాలలో అక్షరాలు నేర్చుకుంటూ ఆరోగ్యంగా ఆడుకోవాల్సిన చిన్నారులకు సరైన కూడు దొరకక బక్కచిక్కిపోతున్నారు. అక్షరాలు దిద్దని అనాథలుగా పొలాలు చెరువు గట్లపై పుట్టల చుట్టూ తిరుగుతూ కర్పూరంలా బాల్యం కరిగిపోతున్న వైనం. మండలంలోని కోటప్పనగర్ సమీపంలోని చెరువు గట్లపై నివాసముంటున్న ఆ చిన్నారులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. పది సంవత్సరాల క్రితం పొట్టకూటికోసం పొలం పనులు చేసుకునేందుకు ప్రకాశం జిల్లా నుంచి కోటప్పనగర్ సమీపంలోని చెరువుగట్టుపై గుడారాలు నిర్మించుకొని యానాదులు జీవనం సాగిస్తున్నారు. వారి సంతానం బడికి దూరంగా బాల్యం గడిచిపోతోంది. వీరు చెరువులోని చేపలను పట్టుకుంటూ, దొరికిన పనులను చేసుకుంటూ కాలక్షేపం చేస్తుంటారు. అంతేకాకుండా వారు పనుల కోసం వేరే ప్రాంతాలకు వలసపోతుంటారు. దీంతో ఆ చిన్నారులకు బడి బాట పట్టే అవకాశం లేకుండా ఉంది. అంతేకాకుండా వారికి పౌష్టికాహార లోపంతోనూ బక్కచిక్కిపోతున్నారు. ఇలా జీవనం గడుపుతున్న వారిపై అధికారులు, ప్రభుత్వం కనీసం పట్టించుకున్న దాఖలాలు కనబడటం లేదు. వినుకొండ పట్టణానికి కూతవేటు దూరంలో 20మందికి పైగా చిన్నారులు ఆట పాటలకు, అక్షరాలకు దూరమై గుడారాల్లో గడపాల్సిన పరిస్థితి. అంతేకాకుండా అక్కడ పెద్ద సంఖ్యలోనే బాల్య వివాహాలు జరిగి, వారు తల్లిదండ్రులు అయిన వారు ఉన్నారు. బలపం పట్టని ఈ చిన్నారులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని కనీసం అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అయిన పౌష్టికాహారం అందించి అక్షర ముక్కలు నేర్పేందుకు అడుగులు వేస్తారని నిరుపేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు. చెరువుగట్లపై నివాసం ఉంటూ, సంచారం జీవుల్లా ఉన్న ఈ యానాది కుటుంబాలకు కనీసం ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులు లేవు. చిన్నారుల భవిత్యం ఇలా బక్కచిక్కి పోతుండటంపై పలువురిలో ఆవేదన నెలకొని ఉంది. ఈ చిన్నారుల భవితవ్యంపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని పలువురు వేడుకొంటున్నారు.

అగ్ని బాధితులకు అండగా ఉంటాం: చీఫ్‌విప్ జీవీ


అగ్ని ప్రమాద బాధితులకు వంట సామగ్రి, నిత్యావసరాలను అందజేస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

ఈపూరు, జనవరి (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటామని, ప్రభుత్వం వారిని ఆదుకుంటుందని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు హామీ ఇచ్చారు. మండలంలంలోని వనికుంట గ్రామంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోయిన బచ్చనబోయిన నర్సమ్మ, షేక్ నన్నేషా కుటుంబాలను బుధవారం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పరామర్శించారు. బాధితులకు శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సాయంతో పాటు వంటసామగ్రి, నిత్యావసరాలు, దుస్తులు అందజేశారు. ప్రమాదంలో గాయపడిన గేదెలను పరిశీలించారు. అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన రెండు కుటుంబాలకు శాశ్వత గృహాలను నిర్మించి ఇస్తామన్నారు. ప్రభుత్వం తరుపున అందించాల్సిన ఆర్థిక సాయాన్ని త్వరితగతిన అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావర్ల జగ్గారావు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య,మాజీ ఎంపీపీ బొల్లా వెంకట కోటయ్య, సర్పంచ్‌లు బచ్చనబోయిన వెంకట సుబ్బమయ్య, గోనుగుంట్ల శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ గడిపూడి వేణుగోపాల్, అయినాల కోటేశ్వరరావు, నర్రా కిశోర్, దండే కోటేశ్వరరావు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఉద్యోగుల బకాయిలను విడుదల చేయాలి

యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి


జేసీ సూరజ్ ధనుంజయ్ ఘనోరేకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు కే శ్రీనివాసరెడ్డి, ఎం మోహనరావు తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్ ప్రకటించి, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఘనోరేకు యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కే శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2023 జూలై 1 నుంచి అమలు కావాల్సిన 12వ రివిజన్ కమిషన్, నేటికి కనీసం కమిటీని కూడా నియమించలేదన్నారు. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు 12వ పీఆర్సీను 18 నెలల కాలాన్ని కోల్పోవాల్సి వచ్చిందన్నారు. అంతేకాకుండా గత 11వ పీఆర్సీ సంబంధించిన బకాయిలు రూ.7384కోట్లు, డీఏ బకాయిలు రూ.9650కోట్లు, ఎంప్లాయిస్ సరెండర్ లీవ్ రూ.2250 కోట్లు సీపీఎస్ ఎంప్లాయీస్ బకాయిలు రూ.2500 కోట్లు, ఏపీ జీఎల్ఐ బకాయిలు రూ.950 కోట్లు చెల్లించాలన్నారు. ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఐఆర్ 30 శాతం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు, కోశాధికారి రవి, కార్యదర్శి టీ వెంకటేశ్వర్లు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఆర్.అజయ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ డీ లింగయ్య, రాష్ట్ర కుటుంబ సంక్షేమ ఆడిటర్ పీ ప్రేమ్‌కుమార్, టౌన్ ప్రధాన కార్యదర్శులు పీ సత్యానందరావు, కే వెంకటేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

వజ్రగిరి జస్టిస్‌కు రెండు అవార్డులు

వినుకొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19వ తేదీన అమలాపురం కోనసీమ చిత్ర కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళ బ్రహ్మోత్సవాల పోటీల్లో వినుకొండ పట్టణానికి చెందిన చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్‌కు అంతర్జాతీయ చిత్రకళా ప్రథమ బహుమతి, భారత చిత్రకళారత్న బ్రహ్మోత్సవ అవార్డు, బ్రహ్మోత్సవ ఆర్ట్ లెజెండ్ అవార్డు ఇచ్చి ఆయనను సత్కరించినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలు అవార్డులకు ఎంపికైన వజ్రగిరి జస్టిస్‌కు వినుకొండ పట్టణ పుర ప్రముఖులు అభినందనలు తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు అంటించరాదు

● మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్


మున్సిపల్ సిబ్బంది సాయంతో పోస్టర్లను తొలగిస్తున్న మున్సిపల్ కమిషనర్

వినుకొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు, వ్యాపార ప్రకటనలు, మతపరమైన పోస్టర్లు అంటించరాదని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ బుధవారం తెలిపారు. ఇష్టారాజ్యంగా పోస్టర్లు అంటించడం వలన అపరిశుభ్రత నెలకొంటోందని, వీటివల్ల వాహనదారులు దృష్టి మరలి ప్రమాదాలకు గురవుతున్నారని, గోడలకు అంటించిన పోస్టర్లను పశువులు తినడం వలన పశువులు అనారోగ్యం బారిన పడుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.


రీ సర్వేపై జరిగిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ సురేష్, సిబ్బంది

రీ సర్వేపై అవగాహన సదస్సు

వినుకొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు భూ రీసర్వేలో భాగంగా మండలంలోని ఏనుగుపాలెంలో రైతులకు తహసీల్దార్ రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండ మండలంలో ఏనుగుపాలెం గ్రామాన్ని నూతనంగా రీ సర్వేకు ఎంపిక చేయడం జరిగిందని, రీ సర్వేలో ఎదురవుతున్న సమస్యలపై రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మురళి, ఇన్‌చార్జి సర్వేయర్ చండీరాణి, ఆర్ఐ శ్రీహరి, వీఆర్వోలు పాల్గొన్నారు.


రిజిస్టర్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బీ రవి

వైద్యశాలల్లో డీఎంహెచ్‌వో తనిఖీ

రొంపిచర్ల, జనవరి 22 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్ల, వీరవట్నం, వడ్లమూడివారిపాలెం గ్రామాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య వైద్యశాలలను డీఎంహెచ్‌వో డాక్టర్ బీ రవి బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. టీకాలు పంపిణీ, క్యాన్సర్ స్క్రీనింగ్ వివరాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల వివరాలను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారి జగన్ నరసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మలా పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ


ఆహారపదార్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ కేఎంఏ హుస్సేన్

వినుకొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె సమీపంలోని నిర్మలా పాఠశాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పథకం అసిస్టెంట్ డైరెక్టర్, ఏసీజీఈ కమిషనర్ కేఎంఏ హుస్సేన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ముందుగా పాఠశాల ఆవరణను పరిశీలించి వంటగదిలో విద్యార్థులకు తయారుచేస్తున్న ఆహార పదార్థాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీని తొలగించి నూతన ఏజెన్సీలను నియమించామన్నారు. పాఠశాలల్లో భోజనం చేస్తున్న విద్యార్థులకు మాత్రమే హాజరు నమోదు చేయాలన్నారు. విద్యార్థుల హాజరును అధికంగా నమోదుచేస్తే హెచ్‌ఎంలు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం సిద్ధార్థిని తదితరులు ఉన్నారు.


వీల్‌చైర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

వీల్‌చైర్ అందజేత

నరసరావుపేట టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం 25వ వార్డుకి చెందిన తిరుపతి ప్రసాద్ పక్షవాతంతో నడవలేని స్థితిలో ఉన్నాడు. స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం వీల్‌చైర్ టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కావూరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యువతరానికి ఆదర్శం మంత్రి లోకేశ్

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సవాళ్లను అధిగమించి లక్ష్యాలను చేరుకోవడంలో మంత్రి లోకేశ్ ప్రథమస్థానంలో నిలిచారని, కోట్లమంది యువతకు ఆదర్శమంటూ ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాట స్ఫూర్తికి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షల ప్రతినిధిగా లోకేశ్ ఉన్నారన్నారు. రాష్ట్రమంత్రిగా, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా తనదైన ముద్రవేసుకున్నారన్నారు. యువతకు నాణ్యమైన విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పార్టీ కార్యకర్తలకు కొండంత భరోసా ఇస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా నిరూపించుకుంటున్నారన్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ మనవడిగా, చంద్రబాబునాయుడు కుమారుడిగా పార్టీ అభివృద్ధికి చేస్తున్న కృషికి ఇటీవల టీడీపీ రికార్డుస్థాయి కోటి సభ్యత్వ మార్కును అందుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వంలో ఐటీ, విద్యాశాఖ మంత్రిగా తెలుగుదేశం గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రిగా చేసిన సేవలు ఆయన పనితీరుకు నిదర్శనమన్నారు. గతంలో సీసీరోడ్లు, పక్కా ఇళ్ళ నిర్మాణంలో ఏపీని దేశంలో నెంబర్ 1గా నిలిపారని, ఐటీ రంగానికి బలమైన పునాదులు వేశారని గుర్తుచేశారు. ఆదేస్ఫూర్తితో విద్యారంగంలో విప్లవాత్మకంగా సంస్కరణలు, ఐటీని మరింత ముందుకు తీసుకువెళ్ళడానికి కృషిచేస్తున్నారన్నారు. టీడీపీ ప్రతిపక్షంగా ఉన్నప్పుడు యువగళం పాదయాత్ర ద్వారా కార్యకర్తల్లో ధైర్యం, పోరాట స్ఫూర్తిని నింపారన్నారు.


అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

● కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్



నిరసన ర్యాలీలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్, కాంగ్రెస్ శ్రేణులు, తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీ అలెగ్జాండర్ సుధాకర్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీ అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అనుచిత వాఖ్యలు చేయడం దురదృష్టకరం అన్నారు. కేంద్రమంత్రి అమిత్‌షా తన మాటలను ఉపసంహరించుకోవాలన్నారు. అదేవిధంగా కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ వినుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి బోయపాటి రామాంజనేయులు, చిలకలూరిపేట మద్దుల రాధాకృష్ణ, సత్తెనపల్లి చుక్కాపాల్, గురుజాల యలమందారెడ్డి, మాచర్ల రామచంద్రారెడ్డి, పెదకూరపాడు పమిడి నాగేశ్వరరావు, నరసరావుపేట షేక్ మహబూబ్ బాషా, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు తోట విజయలక్ష్మి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా గోపీ, కృష్ణ, ప్రసాద్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు ఇమ్మానియేలు, కొండలు, బక్కా బ్రహ్మయ్య, నాగార్జున, రవికిషోర్, ఖాజా, పూర్ణచంద్రరావు, సత్యం, డీబీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్‌కుమార్ పాల్గొన్నారు.


కొండవీడు యూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న బృందం

పాఠశాలలో సామాజిక తనిఖీ బృందం తనిఖీ

కొండవీడు (యడ్లపాడు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన అంశాల పరిశీలనకోసం ప్రభుత్వం సామాజిక తనిఖీలను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా సర్వశిక్షా అభియాన్ డైరెక్టర్ ఏర్పాటుచేసిన సామాజిక తనిఖీ బృందం సభ్యులు కె.శ్రీనివాసరావు, బి.బీమానాయక్‌లు మండలంలోని కొండవీడు ఎంపీయూపీ పాఠశాలను బుధవారం సందర్శించారు. ముందుగా పాఠశాలకు వచ్చిన నిధులు, వాటిని ఎలా ఖర్చుచేశారు, వచ్చిన పుస్తకాలు, పాదరక్షలు, యూనిఫాం, పంపిణీ సక్రమంగా జరిగిందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మౌలిక వసతులు, విద్యార్థుల భద్రత, తరగతి గదుల్లో సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం, క్రీడలు, విద్యతోపాటు ఇతర అంశాలలో విద్యార్థులు సాధించిన ప్రతిభ, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రులు, విద్యార్థులు, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. వారినుంచి సలహాలు, ఫిర్యాదులు స్వీకరించారు. విద్యార్థులు ఆడుకునేందుకు ఆట స్థలం, అలాగే మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు వంటగది, ఉపాధ్యాయులకు ప్రత్యేక టాయిలెట్లు, సరిపడ ఫర్నిచర్ లేదని తనిఖీ బృందం దృష్టికి తెచ్చారు. అంతేగాకుండా పాఠశాలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయవలసిన అవసరాన్ని తనిఖీ బృందానికి వివరించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, పీఎంసీ సభ్యులు తెలిపిన అంశాలను నమోదు చేసుకున్న సభ్యులు ప్రభుత్వానికి నివేదిక రూపంలో తెలియచేస్తామన్నారు. మెరుగైన ఫలితాల సాధనకు ఏమేం చేయాలన్న అంశాలపై ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోరంట్ల శ్రీనివాసరావు, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.